www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 103 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com గురువారం 30 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

- విపక్షాల నినాదాల మధ్య ఆమోదం
- మూజువాణి ఓటుతో యాంటీ పేపర్ లీక్ బిల్లుకు ఆమోదం
- బిల్లును జేపీసీకి పంపాలని డిమాండ్ చేసిన కొందరు ఎంపీలు
- ఎంపీలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు ప్రకటించిన స్పీకర్ ఓం బిర్లా



**ఢిల్లీ :** యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జేపీసీకి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. - మిగతా 2 లో

## 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్'

### మొక్కకు పవన్ నామకరణం



- 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్'... అద్భుత సుగంధ పరిమళాలు వెదజల్లే మొక్కకు పవన్ నామకరణం
- తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన మొక్క
- టక్రోటన్ ఉబ్బలమడుగుయెన్సిస్టగా నామకరణం చేసిన పవన్ కల్యాణ్
- తిరుపతి జిల్లా ఉబ్బలమడుగు జలపాతం సమీపంలో ఆవిష్కరణ
- అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా వర్గీకరించిన పరిశోధకులు

**అమరావతి :** తూర్పు కనుమల్లో తాజాగా గుర్తించిన ఒక అరుదైన మొక్క జాతికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. తిరుపతి జిల్లాలోని సుప్రసిద్ధ ఉబ్బలమడుగు జలపాతం సమీపంలో ఈ మొక్కను కనుగొన్న - మిగతా 2 లో



## ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ సేవలు


- ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ నుంచి వాణిజ్య విమాన సేవలు
- విశాఖపట్నం సివిల్ ఎన్‌క్లేవ్‌లో విమాన కార్యకలాపాలకు ముగింపు
- కొత్త విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం
- ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**విశాఖపట్నం :** విశాఖపట్నం విమానయాన చరిత్రలో ఒక శకం ముగిసి, కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. ఆగస్టు 17వ తేదీ నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య విమాన - మిగతా 2 లో

## తైవాన్ పారిశ్రామిక ప్రతినిధులతో

# చంద్రబాబు, లోకేశ్ భేటీ

- ఏపీలో పెట్టుబడులకు తైవాన్ ఆసక్తి
- చంద్రబాబు, లోకేశ్ తో దిగ్గజ కంపెనీల ప్రతినిధుల భేటీ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తో వేర్వేరుగా భేటీ అయిన తైవాన్ పారిశ్రామిక ప్రతినిధులు
- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా చర్చలు
- రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి
- ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై కీలక ఒప్పందాలు
- తయారీ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి అంగీకారం



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు తైవాన్ పారిశ్రామిక ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లతో వేర్వేరుగా సమావేశమైంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అధునాతన తయారీ రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు.డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జీలీ కన్‌స్ట్రక్షన్స్ వంటి పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు అందుబాటులో ఉన్న సానుకూల వాతావరణాన్ని వారికి వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, విమానాశ్రయాలు, పటిష్టమైన రోడ్డు, రైలు మార్గాల ద్వారా బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రాష్ట్రం కలిగి ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై తమ ప్రభుత్వం ప్రత్యేక - మిగతా 2 లో



## ఆగస్ట్ 12న సంపూర్ణ సూర్యగ్రహణం కానీ భారత్‌లో కనిపించదు!

- ఆగస్ట్ 12, 2026న సంపూర్ణ సూర్యగ్రహణం
- రాత్రి సమయంలో గ్రహణం ఏర్పడటంతో భారత్‌లో కనిపించదు
- నాసా లైవ్ స్ట్రీమ్ ద్వారా వీక్షించే అవకాశం

**ఢిల్లీ :** 2026 ఆగస్టు 12న సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో మాత్రం కనిపించదు. మన దేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణం.సూర్యుడికి, - మిగతా 2 లో

## ఉక్రెయిన్‌లో ఉద్రిక్తత..

## నౌకలో చిక్కుకున్న 13 మంది భారత నావికులు




- ఉక్రెయిన్ పోర్టులో చిక్కుకున్న 13 మంది భారత నావికులు
- డ్రోన్, క్షిపణి దాడుల మధ్య ప్రాణభయంతో సిబ్బంది
- తక్షణం కాపాడాలంటూ సీఫేరర్స్ యూనియన్ విజ్ఞప్తి
- నౌక సమీపంలో దాడుల వీడియో విడుదల


**ఢిల్లీ :** ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో ఒక కార్గో నౌకలో 13 మంది భారత నావికులు సహా మొత్తం 15 మంది సిబ్బంది చిక్కుకుపోయారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న పోరులో భాగంగా నల్ల సముద్రం సమీపంలో నిరంతరం డ్రోన్, క్షిపణి దాడులు జరుగుతుండటంతో వారు తీవ్ర ప్రాణభయంతో ఉన్నారని 'ఫార్వార్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్‌యూఐ) ఆందోళన వ్యక్తం చేసింది.'ఎం.వీ. అమీర్1' అనే నౌక భయంకరమైన, ప్రాణాంతక పరిస్థితుల్లో చిక్కుకుందని ఎఫ్ఎస్‌యూఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. "నౌక సమీపంలో పదేపదే డ్రోన్, క్షిపణి దాడులు జరుగుతున్నాయి. ఏ క్షణంలోనైనా నౌకపై నేరుగా దాడి జరగవచ్చనే భయంతో సిబ్బంది బతుకుతున్నారు" అని యూనియన్ పేర్కొంది. సిబ్బందిని తక్షణమే కాపాడి, వారిని స్వదేశానికి తరలించే ఏర్పాట్లు చేయాలని భారత ప్రభుత్వం, నౌక యాజమాన్యం, ఇతర అధికారులను కోరింది. "సంఘర్షణ ప్రాంతాల్లో భారత నావికులను ఇలా లక్ష్యాలుగా వదిలేయవద్దు. - మిగతా 2 లో

## ప్రపంచంలో నాలుగో అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌గా పాకిస్థాన్

- హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో పాకిస్థాన్‌కు 101వ ర్యాంక్
- కేవలం 29 దేశాలకు మాత్రమే వీసా లేకుండా ప్రయాణించే సౌకర్యం
- ఈ జాబితాలో భారత్ 81, చైనా 60వ స్థానంలో ఉన్నాయి
- ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా సింగపూర్ అగ్రస్థానం

**ఢిల్లీ :** అంతర్జాతీయంగా పాకిస్థాన్ మరోసారి తీవ్ర అప్రతిష్ఠను మూటగట్టుకుంది. ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌లు - మిగతా 2 లో



## తెలంగాణలోని బొగత జలపాతం ఉగ్రరూపం.. సందర్శన నిలిపివేత

- వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం
- పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టిన అధికారులు

**హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా - మిగతా 2 లో

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది



- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న - మిగతా 2 లో

## కాళేశ్వరం నీరు వాడకుండానే

# రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి

- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర లోపాలున్నాయని ఉత్తమ్ ఆరోపణ
- మేడిగడ్డ-అన్నారం బ్యారేజీలపై ఆందోళన వ్యక్తం
- సిడబ్ల్యూపిఆర్ఎస్, ఎన్‌డిఎస్‌ఎ నివేదికలతో లోపాలు వెలుగులోకి వచ్చాయని వెల్లడి
- ఎన్డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు లేఖ
- ధాన్యం కుంభకోణంలో బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి
- ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని స్పష్టం



**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు.బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో - మిగతా 2 లో

# సంపాదకీయం

## డిజిటల్ కంటెంట్‌లో హింస, అశ్లీలతకు కళ్లెం అవసరం

(హెచ్.ప్రతాప్)

సాంకేతిక విప్లవంతో డిజిటల్ ప్రపంచం ప్రతి ఇంట్లోకి, ప్రతి చేతిలోకి చేరింది. ఓటీటీ వేదికలు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, షార్ట్ వీడియో యాప్‌లు వినోదానికి, విజ్ఞానానికి, సృజనాత్మకతకు కొత్త అవకాశాలు తెరిచాయి. అదే సమయంలో హింస, అశ్లీలత, అసభ్య భాష, మహిళలను కించపరిచే సంభాషణలు, లైంగికంగా అభ్యంతరకర దృశ్యాలు కూడా వేగంగా విస్తరిస్తున్నాయి. డిజిటల్ కంటెంట్‌లో హింస, అశ్లీలతను కట్టడి చేయడం ఇప్పుడు కేవలం నైతిక అంశం కాదు; అది పిల్లల రక్షణ, సమాజ భద్రత, ప్రజా సంస్కృతి, భావి తరాల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసర అవసరంగా మారింది. ఇటీవలి కాలంలో జరిగిన కొన్ని పరిణామాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రముఖ డిజిటల్ కంటెంట్ సృష్టికర్త రణవీర్ అల్లాబాదియా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై స్పందించిన సుప్రీంకోర్టు వాటిని అసహ్యకరమైనవి, అసభ్యమైనవి, సామాజిక మర్యాదలకు విరుద్ధమైనవిగా అభివర్ణిస్తూ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు కూడా రాజ్యాంగబద్ధమైన పరిమితులు ఉంటాయని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఓటీటీలు, సోషల్ మీడియా వేదికల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించాలంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి, ప్రముఖ డిజిటల్ వేదికలకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కూడా 2025లో అశ్లీల కంటెంట్‌ను వ్యాప్తి చేస్తున్న పలు సోషల్ మీడియా ఖాతాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఐటీ చట్టం, ఐటీ రూల్స్ ఉల్లంఘించిన 18 ఓటీటీ వేదికలను నిషేధించడం కూడా ఇదే దిశలో తీసుకున్న చర్యగా గుర్తించాలి.ప్రస్తుతం భారత్‌లో 90 కోట్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. వీరిలో గణనీయమైన శాతం పిల్లలు, కిశోరులు, యువతే ఉన్నారు. ఈ పరిస్థితిలో నియంత్రణ లేని హింసాత్మక, అశ్లీల డిజిటల్ కంటెంట్ ప్రభావం వ్యక్తిగత స్థాయిని దాటి సామాజిక స్థాయికి చేరుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థలు వెల్లడించిన అధ్యయనాల ప్రకారం హింసాత్మక దృశ్యాలను నిరంతరం వీక్షించే పిల్లల్లో దూకుడు ప్రవర్తన, సానుభూతి లోపం, హింసను సహజంగా స్వీకరించే విపరీత ధోరణి పెరిగే అవకాశం ఉంది. అలాగే చిన్న వయసులోనే అశ్లీల కంటెంట్‌కు గురికావడం వల్ల మహిళల పట్ల వక్రీకృత దృక్పథం, లైంగిక నేరాల పట్ల అసహజ ఆసక్తి, సంబంధాలపై అవాస్తవ అంచనాలు, తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. సమాజంపై దీని ప్రభావం మరింత విస్తృతమైనది. కుటుంబ సభ్యులు అందరూ కలిసి చూసే ఆరోగ్యకరమైన వినోద సంస్కృతి నేడు తీవ్రంగా దెబ్బతింటోంది. అసభ్య పదజాలం దైనందిన సాధారణ సంభాషణలో భాగమవుతోంది. మహిళలను కేవలం భోగ వస్తువులుగా చిత్రీకరించే ప్రమాదకర ధోరణి సమాజంలో బలపడుతోంది. సైబర్ వేధింపులు, డిజిటల్ మార్ఫింగ్, "నూడిఫై" వంటి కృత్రిమ మేధస్సు ఆధారిత నూతన దుర్వినియోగాలు వేగంగా పెరుగుతున్నాయి. ఇటీవల బారేలీలో పాఠశాల విద్యార్థినుల చిత్రాలను కృత్రిమ మేధస్సుతో అసభ్యకరంగా మార్చి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన భయానక ఘటన సాంకేతికతను ఎంత వికృతంగా దుర్వినియోగం చేస్తున్నారో స్పష్టంగా వెల్లడించింది. హింసను వినోదంగా, అసభ్యతను స్వేచ్ఛగా చూపించే సంస్కృతి క్రమంగా సమాజంలో మర్యాద, పరస్పర గౌరవం, బాధ్యతాయుత సంభాషణలను బలహీనపరుస్తోంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి అత్యంత విలువైన మూలస్తంభం వంటి హక్కు. అయితే ప్రజాస్వామ్య స్వేచ్ఛకు సామాజిక బాధ్యత కూడా తోడుండాలి. సృజనాత్మకత లేదా కళాత్మక స్వేచ్ఛ పేరిట చట్టవిరుద్ధమైన, అసభ్యమైన, బాలలకు హానికరమైన కంటెంట్‌ను సమర్థించడం ఎంతమాత్రం సమంజసం కాదు. అందుకే ప్రభుత్వం అమలు చేస్తున్న సమాచార సాంకేతిక చట్టం, ఐ టి చత్తం-2021 , భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత చట్టపరమైన నిబంధనలను మరింత సమర్థంగా, కఠినంగా అమలు చేయాల్సిన అత్యవసర అవసరం ఉంది. ఈ క్లిష్టమైన సమస్యకు సమగ్రమైన పరిష్కారం అవసరం. ఓటీటీలు, సోషల్ మీడియా సంస్థలు బలమైన ప్రీ-మోడరేషన్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత కంటెంట్ ఫిల్టర్లు, స్పష్టమైన వయస్సు వర్గీకరణ, పేరెంటల్ కంట్రోల్, వయస్సు నిర్ధారణ వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేయాలి. వినియోగదారుల ఫిర్యాదులపై 24 నుంచి 72 గంటల్లో తక్షణమే స్పందించే గ్రీవెన్స్ అధికారులను నియమించి, పారదర్శక కంప్లయన్స్ నివేదికలను క్రమం తప్పకుండా విడుదల చేయాలి. చట్టాన్ని ఉల్లంఘించే కంటెంట్ సృష్టికర్తలపై భారీ జరిమానాలు, కంటెంట్ శాశ్వత తొలగింపు, అవసరమైతే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో పాఠశాలలు, కళాశాలల్లో డిజిటల్ అక్షరాస్యత, సైబర్ నైతికత, బాధ్యతాయుత సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. తల్లిదండ్రులు పిల్లల స్క్రీన్ సమయాన్ని పర్యవేక్షిస్తూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించాలి. డిజిటల్ స్వేచ్ఛను కాపాడటం ఎంత ముఖ్యమో, ఆ స్వేచ్ఛ సమాజానికి హాని కలిగించకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. సాంకేతికత మనిషి అభివృద్ధికి సాధనంగా నిలవాలే తప్ప, హింస, అసభ్యత, నైతిక పతనానికి వేదికగా మారకూడదు. చట్టాలు, సాంకేతిక నియంత్రణ, సామాజిక చైతన్యం, కుటుంబ బాధ్యతలు కలిసినప్పుడే డిజిటల్ ప్రపంచం నిజమైన అర్థంలో విజ్ఞానానికి, వినోదానికి, విలువలకు ఉత్తమ వేదికగా నిలుస్తుంది.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి -** అంతకుముందు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. చర్చ సందర్భంగా విపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు."ప్రతిపక్షాలను చూస్తుంటే ఈ దృశ్యం చాలా నిరాశ కలిగించేలా ఉంది. ఇంతటి ముఖ్యమైన బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రధాని మోదీ చిత్తశుద్ధితో, ఎంతో సున్నితత్వంతో ఈ బిల్లును సభలోకి తీసుకొచ్చినప్పుడు సీరియస్‌గా చర్చించి, సలహాలు ఇవ్వడానికి బదులు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత ప్రవర్తన చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. రాహుల్ గాంధీ అప్రజాస్వామిక భాష వాడారు. ఆయన వాడిన పదాలు సభా సంప్రదాయాలకు విరుద్ధమైనవి. అంతేకాదు అది ఎంతటి అన్‌పార్లమెంటరీ పదమంటే ఆ పదాన్ని నేను నా నోటితో ఉచ్చరించలేను. ఒకవేళ ఏ వ్యక్తైనా లేదా గౌరవసభ్యుడైనా తనను తాను 'ఇడియట్' అనుకున్నప్పటికీ, ఆ పదాన్ని ఇక్కడ వాడకూడదు. సభ వెలుపల వెళ్లి అనవచ్చు కానీ, సభలో అనటానికి వీల్లేదు. ప్రతిపక్ష నేతకు ఇలాంటి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన లేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోందన్న పీఎంవో సహాయ మంత్రి, జితేంద్రసింగ్. కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను జితేంద్ర సింగ్ ఖండించారు. "కాల్పుల ఆదేశాలను మంత్రి ఇవ్వరు మేజిస్ట్రేట్ ఇస్తారు. అసలు కాల్పులు జరగనే లేదు. బాష్పవాయువు ప్రయోగించారు. కాల్పులు జరగకపోతే ఆదేశాలు ఇచ్చారనే మాటకు అర్థం లేదు. హోంమంత్రి విదేశాలకు వెళ్లారని ఆరోపణలు చేస్తున్నారు. హోంమంత్రి విదేశాలకు వెళ్లినట్లు మాకెలాంటి సమాచారం లేదు. అవాస్తవాలు చెప్పి సభ నుంచి వెళ్లడం బాధ్యతాయుతం కాదు. ప్రధాని నివాసం ముందు బైఠాయించి నిరసన తెలపడం సమంజసం కాదు. ప్రధాని నివాసం ముందు నిరసన సముచితం కాదని చెప్పినా పట్టించుకోలేదు. 150 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అన్నిసార్లు పేపర్ లీక్ అయ్యాయనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. 150 సార్లు పేపర్ లీక్ వల్ల 750 కోట్ల విద్యార్థులపై ప్రభావం పడిందన్నారు. దేశ జనాభాను ప్రపంచ జనాభాతో పోల్చి ప్రియాంక చెప్పారు. ఎన్‌డీఏ హయాంలో 30 శాతం మేర ఉన్నత విద్యాలయాలు పెరిగాయి. ఎన్‌డీఏ హయాంలో 763 యూనివర్సిటీల నుంచి 1293కి పెంచాం." అని జితేంద్ర సింగ్ అన్నారు.పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు-2026ను ఇంతకుముందు కేంద్రం ప్రతిపాదించింది. పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించింది. జరిమానాను 10 లక్షల నుంచి 50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేసింది. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను కోటి నుంచి 5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చింది. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదన చేసింది. నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, 5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను కోటి నుంచి 10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది.

# ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ సేవలు

**మొదటిపేజీ తరువాయి -** సర్వీసులు పూర్తిగా నిలిచిపోనున్నాయి. వాటి స్థానంలో విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది.ఆగస్టు 17వ తేదీ అర్ధరాత్రి 00.01 గంటల నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య కార్యకలాపాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అదే సమయం నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (×చీూ దేగా)లోని సివిల్ ఎన్‌క్లేవ్‌లో విమాన సేవలు ఆగిపోతాయి. అయితే, జాతీయ అత్యవసర సమయాల్లో, భారత వాయుసేన, ఇతర సాయుధ దళాలు, పోలీసు విభాగాలు, ప్రభుత్వ వీఐపీ విమానాల రాకపోకలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయ కోడ్ "ఝ" ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. ఈ నూతన విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దాదాపు రూ. 4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే, కేవలం 31 నెలల్లో దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులన్నీ లభించాయి.మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ఈ ఎయిర్‌పోర్ట్‌ను రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.2,703



ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాలు విమానాశ్రయానికి, మిగిలినవి ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీలకు కేటాయించారు. బోయింగ్ 777, డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ూ330 వంటి భారీ విమానాలు సైతం సులభంగా దిగేందుకు వీలుగా 3,800 మీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు. అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలు, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, స్మార్ట్ సర్వైలెన్స్ వంటి సాంకేతికతలతో ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభూతిని అందించేలా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు.

## 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్' మొక్కకు పవన్ నామకరణం



**మొదటిపేజీ తరువాయి -** నేపథ్యంలో, ఆ ప్రాంత విశిష్టతను ప్రతిబింబించేలా దీనికి 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్' అని పేరు పెట్టారు.ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) పి.వి. చలపతి రావు నేతృత్వంలోని బృందం, ఉబ్బలమడుగు పరిసరాల్లోని కంబకం కొండల్లో చేపట్టిన విస్తృత పరిశోధనలో ఈ మొక్క వెలుగుచూసింది. యూఫోర్బియేసి కుటుంబానికి చెందిన ఈ మొక్క, తనకు సామీప్యం ఉన్న 'క్రోటన్ అరోమాటికస్' జాతి కంటే భిన్నమైనదని శాస్త్రీయ విశ్లేషణలో నిర్ధారించారు. దీని బాహ్య ఆకృతి, పునరుత్పత్తి లక్షణాలు మరియు సువాసన వెదజల్లే ఆకుల ఆధారంగా దీనిని ఒక కొత్త జాతిగా శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. ఈ మొక్క అత్యంత పరిమిత ప్రాంతంలోనే లభ్యమవుతుండటం, దాని సహజ ఆవాసానికి ముప్పు పెరుగుతుండటంతో పరిశోధకులు దీనిని అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతిగా వర్గీకరించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవవైవిధ్య సంపదను చాటిచెప్పడమే కాకుండా, ఈ ప్రాంతంలో మరిన్ని శాస్త్రీయ పరిశోధనలు, సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. ఉబ్బలమడుగు ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించడంతో పాటు, సహజ వారసత్వాన్ని కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు ఈ నామకరణం నిదర్శనమని అటవీ శాఖ, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు.

## తైవాన్ పారిశ్రామిక ప్రతినిధులతో చంద్రబాబు, లోకేశ్ భేటీ


**మొదటిపేజీ తరువాయి -** దృష్టి సారించిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పూర్తిస్థాయి ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.భారత్‌లో తమ దేశ సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు విస్తరించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తో తైవాన్ ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా మానవ వనరుల అభివృద్ధి, ఏపీ యువతకు నైపుణ్యాల కల్పనపై చర్చించారు. తైవాన్ తయారీ, సాంకేతిక రంగాల్లోని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతకు అవసరమైన శిక్షణ, ఉన్నత విద్యా భాగస్వామ్యంపై లోకేశ్ వారితో విస్తృతంగా మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారానికి నిర్ణయించారు.ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడం, యువతకు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలపై కూడా చర్చలు జరిగాయి. ఏపీ, తైవాన్ మధ్య సంబంధాలలో ఈ సమావేశాలు ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. పారిశ్రామిక పెట్టుబడులతో పాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆగస్ట్ 12న సంపూర్ణ సూర్యగ్రహణం

**మొదటిపేజీ తరువాయి -** భూమికి మధ్య చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో పగటిపూట కూడా ఆకాశం చీకటిగా మారి, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ సమయంలో నక్షత్రాలు, గ్రహాలు కూడా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. నాసా శాస్త్రవేత్తల కథనం ప్రకారం, సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దదైనప్పటికీ, అదే స్థాయిలో (400 రెట్లు) దూరంగా ఉండటం వల్ల ఆకాశంలో చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తాయి.ఈ సంపూర్ణ గ్రహణం గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉత్తర రష్యా, అట్లాంటిక్ మహాసముద్రం పరిధిలో కనిపిస్తుంది. ఇక ఉత్తర అమెరికా, కెనడా, యూరప్, వాయువ్య ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది.భారత కాలమానం ప్రకారం, ఆగస్టు 12 రాత్రి 9:45 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం, ఆగస్టు 13 తెల్లవారుజామున 2:15 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మన దేశంలో సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రహణాన్ని వీక్షించే వీలు లేదు. అందువల్ల, గ్రహణం సమయంలో పాటించే సూతక్ కాలం వంటి సాంప్రదాయ నియమాలు మనకు వర్తించవని పండితులు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించాలనుకునే భారతీయులు నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వంటి సంస్థల అధికారిక వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చు.

# ప్రపంచంలో నాలుగో అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌గా పాకిస్థాన్

**మొదటిపేజీ తరువాయి -** కలిగిన దేశాల జాబితాలో పాకిస్థాన్ నాలుగో స్థానంలో నిలిచింది. లండన్‌కు చెందిన ప్రముఖ సంస్థ 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్' విడుదల చేసిన తాజా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో ఈ విషయం స్పష్టమైంది. ఈ జాబితాలో పాకిస్థాన్ కంటే కింద ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్ మాత్రమే ఉన్నాయి.ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల పాస్‌పోర్ట్‌ల ప్రయాణ స్వేచ్ఛను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. ఇందులో పాకిస్థాన్ 101వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్ ప్రకారం, పాకిస్థాన్ పౌరులు ముందస్తు వీసా లేకుండా లేదా వీసా-ఆన్-అరైవల్ సదుపాయంతో కేవలం 29 దేశాలకు మాత్రమే ప్రయాణించగలరు.ఈ బలహీన ర్యాంకింగ్‌కు తోడు, ఇటీవలి కాలంలో పాకిస్థాన్ పౌరులు అనేక దేశాల నుంచి వీసా తిరస్కరణలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు పాకిస్థానీయులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధిస్తున్నాయి. గత నవంబర్‌లోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్




(యూఏఈ) పాక్ పౌరులకు వీసాలు జారీ చేయడాన్ని నిలిపివేసింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ అదనపు అంతర్గత వ్యవహారాల కార్యదర్శి సల్మాన్ చౌదరి సెనేట్ కమిటీ సమావేశంలో స్వయంగా ధృవీకరించారు. యూఏఈకి వెళుతున్న పాకిస్థానీయులు నేర కార్యకలాపాల్లో ఎక్కువగా పాలుపంచుకుంటున్నారనే ఆందోళనతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సెనేట్ మానవ హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్ సమీనా ముంతాజ్ జెహ్రీ వెల్లడించారు. కేవలం యూఏఈ మాత్రమే కాకుండా, సౌదీ అరేబియా సహా పలు గల్ఫ్ దేశాలు 2024 డిసెంబర్‌లో పాకిస్థాన్‌లోని సుమారు 30 నగరాల ప్రజలకు వీసాలపై నిరవధిక నిషేధం విధించాయి. విదేశాల్లో భిక్షాటన, స్మగ్లింగ్, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాలు పెరిగిపోవడమే ఈ ఆంక్షలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం డొమినికా, హైతీ, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక వంటి కొన్ని దేశాలు మాత్రమే పాకిస్థానీయులకు వీసా రహిత లేదా వీసా-ఆన్-అరైవల్ సౌకర్యాలను అందిస్తున్నాయి.తాజా ర్యాంకింగ్స్ లో చైనా 60వ స్థానంలో నిలవగా, నిలువగా, భారత్ 81వ స్థానాన్ని దక్కించుకుంది. ఇక ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్ పోర్ట్ గా సింగపూర్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. సింగపూర్ పాస్ పోర్ట్ ఉన్నవారు 192 దేశాలకు ఎలాంటి ముందస్తు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. జపాన్, దక్షిణ కొరియా, యూఏఈ దేశాలు ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాయి.

# ఉక్రెయిన్‌లో ఉద్రిక్తత.. నౌకలో చిక్కుకున్న 13 మంది భారత నావికులు


**మొదటిపేజీ తరువాయి -** వెంటనే చర్యలు తీసుకోండి" అని విజ్ఞప్తి చేసింది. నౌక పరిసరాల్లో దట్టమైన పొగ కమ్ముకుంటున్న దృశ్యాలతో కూడిన ఒక వీడియోను కూడా పంచుకుంది.ఇటీవలి కాలంలో నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై ఇలాంటి దాడులు పెరిగాయి. గత వారం జరిగిన దాడిలో ఒక భారత నావికుడు మరణించిన ఘటనపై భారత్ సోమవారం తీవ్రంగా స్పందించింది. ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పొలిష్‌చుక్‌ను పిలిపించి, వాణిజ్య నౌకలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గట్టిగా నిరసన తెలియజేసింది. ఎంవీ ఒమోర్ఫీ అనే నౌకపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.తాజాగా 13 మంది నావికులు చిక్కుకున్న ఘటనపై భారత విదేశాంగ శాఖ గానీ, సంబంధిత షిప్పింగ్ కంపెనీ గానీ ఇప్పటివరకు స్పందించలేదు.

# రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

**మొదటిపేజీ తరువాయి -**

విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలోని బొగత జలపాతం ఉగ్రరూపం.. సందర్శన నిలిపివేత



**మొదటిపేజీ తరువాయి -** భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది.ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.వరద ఉధృతికి రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో పాటు ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఎవరూ జలపాతం వైపు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలపాత పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు తెలిపారు. వరద తగ్గి పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు పర్యాటకులు పోలీసులు, అటవీ శాఖ అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు.ం

## కాళేశ్వరం నీరు వాడకుండానే రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి




**మొదటిపేజీ తరువాయి -** కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే ఆఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని సిడబ్ల్యూపిఆర్సీ రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్‌డిఎస్‌ఎ మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందని అన్నారు. కమీషన్ల కోసం ఫౌండేషన్ చూసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు.తనకు తెలిసి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టు కూడా మేఘా సంస్థకు ఇవ్వలేదన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐకి లేఖ రాశామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 24 గంటల్లో సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్ట్ చేస్తామన్నారు. ఎన్‌డిఎస్‌ఎ టన్నులు తమ హయంలో పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## జనప్రియలో వైభవంగా గురుపౌర్ణమి పూజలు, అన్నదానం

**పాల్గొన్న బీజేపీ నాయకురాలు బోయిని అనుషా మహేష్ యాదవ్**




**శేరిలింగంపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ ::-(ప్రతినిధి ఎం.ఈరన్న)** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జనప్రియ అపార్ట్‌మెంట్ ఫేజ్-1 లో ప్రత్యేక గురుపూజ మరియు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాఫీజ్‌పేట్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీమతి బోయిని అనుషా మహేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మియాపూర్ లోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా బోయిని అనుషా మహేష్ యాదవ్ మాట్లాడుతూ: "రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు మరియు ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఆ సాయిబాభాను ప్రార్థించాను. గురుపౌర్ణమి పర్వదినం ఆధ్యాత్మిక విలువలను, సమాజంలో గురువుల ప్రాశస్త్యాన్ని గుర్తుచేస్తుంది. గురువుల దివ్య మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలి." కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు ప్రవీణ్, పారునంది నాగులు, హరి, సుధీర్, శ్రీనివాస్ యాదవ్, రామారావు, మృదుల తో పాటు బీజేపీ నాయకులు శ్రీధర్ రావు, రవి గౌడ్, జగన్ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ బస్తీల్లో మౌలిక వసతులు కల్పించాలి

**జిల్లా కలెక్టర్‌కు సీపీఐ(ఎం) వినతి**

**తాగునీరు,డ్రైనేజీ సమస్యలతో ప్రజల తీవ్ర అవస్థలు**

**తక్షణమే చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి మండల కమిటీ విజ్ఞప్తి**

**శేరిలింగంపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :-(ప్రతినిధి ఎం.ఈరన్న)** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా శేరిలింగంపల్లి మండల పరిధిలోని భాగ్యనగర్ బస్తీల్లో తీవ్రంగా ఉన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) శేరిలింగంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బస్తీల్లో సురక్షితమైన తాగునీరు, సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, సక్రమ విద్యుత్ సరఫరా మరియు వీధి దీపాలు లేక స్థానిక ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ప్రజారోగ్య సమస్యలు: అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లపైకి మురుగునీరు, వర్షపు నీరు చేరి కలుషిత వాతావరణం ఏర్పడుతోందని తెలిపారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాపించి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రజారోగ్యం క్షీణిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేయాలి: బస్తీల అభివృద్ధి కోసం కేటాయించిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. బస్తీ వాసులకు మెరుగైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం కల్పించేలా సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సి. కేశన్, ఎం. మహేష్, కె. కృష్ణ, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి నాలాలో కొట్టుకుపోయినా వ్యక్తి

**బాధితులను ఓదార్చిన పూర్వ పురపాలక ప్రతినిధి హమీద్ పటేల్**





**కొండాపూర్,జులై 29 .అక్షర టైమ్స్ :పతినిధి ఎం.ఈరన్న)** కొండాపూర్ విభాగం పరిధిలోని వైశాలి నగర్ - ప్రేమ్ నగర్ బి భాగం వద్ద ఉన్న రైలు మార్గం కింది దారి వద్ద ప్రమాదవశాత్తు కాలువలో ప్రేమ్ నగర్ నివాసి బాలయ్య(70) కొట్టుకుపోవడం జరిగింది. ఈ విషయం తెలియగానే కొండాపూర్ విభాగం పూర్వ పురపాలక ప్రతినిధి హమీద్ పటేల్ సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికులను, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొట్టుకుపోయిన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని రక్షక భట వర్గం, విపత్తు నిర్వహణ దళాలు, పురపాలక ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులను కోరారు. బాలయ్య కుటుంబసభ్యులను హమీద్ పటేల్ ఓదార్చి, ధైర్యంగా ఉండాలని, శాసనసభ్యుడు గాంధీతో కలసి మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## మేడిపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కూతాడి నరసింహ కి ఘన నివాళి



**మేడిపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** మేడిపల్లి మాజీ సర్పంచ్‌గా, మాజీ ఎంపీటీసీగా ప్రజలకు విశిష్ట సేవలందించిన కూతాడి నరసింహ ఈరోజు ఉదయం పరమపదించారు.వారి మరణవార్త ఎంతో బాధాకరం. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ వారి నివాసానికి వెళ్లి, పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.

## నీటి పాత్రపై కేటీఆర్ చిత్రం కళాకారిణి రేవతికి ఘన సన్మానం


**శేర్లింగంపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :-ప్రతినిధి ఎం.ఈరన్న)** "ప్రతిభకు ప్రోత్సాహమే నిజమైన గౌరవం" బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఒక కళాకారిణి ప్రదర్శించిన వినూత్న ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. రేవతి అనే కళాకారిణి నీటి పాత్రపై కేటీఆర్ చిత్రాన్ని అత్యంత అద్భుతంగా ఆవిష్కరించి తన నైపుణ్యాన్ని చాటుకున్నారు. రేవతి వినూత్న శైలిలో ప్రదర్శించిన ఈ కళా ప్రతిభకు ముగ్ధులైన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్, ఆమెను ప్రత్యేకంగా పార్టీ కార్యాలయానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవతిని శాలువాతో సన్మానించి, ఆమె ప్రతిభను మనస్ఫూర్తిగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ --- "ఇలాంటి అసాధారణ కళా నైపుణ్యం కలిగిన కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత. రేవతి గీసిన చిత్రం ఎంతో ప్రత్యేకం, కేటీఆర్ గారిపై ఉన్న అభిమానాన్ని తన కళ ద్వారా చాటుకున్న తీరు అభినందనీయం" అని కొనియాడారు.

## జగనన్న కాలనీలో కమ్యూనిటీ భూములు కబ్జా చేస్తున్నారంటూ కాలనీవాసులు ఆరోపణలు

**ఈమేరకు బుధవారం డి.రమేష్ ఆధ్వర్యంలో కమిషనర్ ఏఎన్ జ్ఞాన ప్రకాష్,మండల రెవెన్యూ అధికారి కే కీర్తి లకు వినతి పత్రాలు**




**ఏలేశ్వరం,జులై 29 .అక్షర టైమ్స్ :** మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి కమిషనర్ ఏఎన్ జ్ఞాన ప్రకాష్, మండల రెవెన్యూ అధికారి కే కీర్తి లకు వినతి పత్రాలు అందజేశారు. సుమారు 2వేల కుటుంబాలకు జగన్ కాలనీలో ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని 4వందల గృహ నిర్మాణాలు జరిగి నివాసముంటున్నట్లు వారు తెలిపారు, అయితే జగన్ కాలనీ, ఏలేరు కాలువకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలం మాదంటూ కొంతమంది కబ్జా చేస్తున్నారని ప్రశ్నిస్తే రికార్డు ఉంది ఇటువైపు ఎవరూ రాకూడదు అంటూ కంచె వేసారని వారన్నారు. ఏడు సంవత్సరాలుగా లేని రికార్డు వారికి ఎలా వచ్చిందంటూ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో నాయకులు ఆ సైట్ విషయమై కమ్యూనిటీ సైట్ గా ప్రకటించి స్మశాన వాటిక, కాలనీవాసులకు పార్కు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, స్కూల్ వంటివి ఇస్తామంటూ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం జగనన్న కాలనీకి సైట్ అమ్మిన వ్యక్తులమంటూ ఇది బఫర్ జోన్ కనుక ప్రభుత్వం ఈ భూమి మా వద్ద నుండి కొనలేదు కనుక మాకే సొంతం అంటూ కొంతమంది సదును చేసేందుకు ప్రయత్నించినప్పుడు ప్రశ్నించగా వెళ్లిపోయారని, ఇప్పుడు మళ్లీ ఆ భూమిని సదులు చేసి ఈ భూమి మాదే రికార్డు ఉందంటూ చెప్పడం విడ్డూరమన్నారు. అలాగే కాలనీలో నివసిస్తున్న కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే స్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆ భూమిని స్మశానవాటికగా గాని, పిల్లలు ఆడుకునేందుకు పార్కుగా గాని కాలనీవాసులకు అప్పగించాలని ఆ కాలనీ మహిళలన్నారు. దీనిపై సంబంధిత మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని జగనన్న కాలనీలో కబ్జాకు గురవుతున్న కమ్యూనిటీ సైట్లు కాపాడి కాలనీ వాసులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వీర్రాజు, ఎస్ సూరిబాబు, జెకె టైలర్, దాసరి సత్తిబాబు, లావరాజు, నాగేశ్వరరావు, కరీం, అర్జున్, కుమారి, పద్మ, బి పద్మ, సత్యవతి, రత్నం, లోవరాజు, గోవిందు రమణ తదితరులు పాల్గొన్నారు.



## సైబరాబాద్ సీపీ మాదాపూర్ పోలీసు స్టేషన్ల ఆకస్మిక తనిఖీ




**మాదాపూర్,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న)** సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, మాదాపూర్ శాంతిభద్రతల పోలీసు స్టేషన్, మాదాపూర్ రవాణా నిబంధనల పోలీసు స్టేషన్‌లను సందర్శించారు. అక్కడి మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, వాహనాల రాకపోకల నిర్వహణ విధానం, పోలీసు సిబ్బంది పనితీరును ఆయన సమగ్రంగా సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన రక్షణ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతుల్లో రాకపోకలను నియంత్రించి, వాహనదారులు, బాటసారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్టేషన్‌లలో మౌలిక వసతులను సక్రమంగా నిర్వహిస్తూ, పరిశుభ్రత, దస్త్రాల నిర్వహణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, సిబ్బంది పరస్పర సహకారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవాణా నిబంధనల శిక్షణ సంస్థను కూడా సందర్శించిన కమిషనర్, సిబ్బందికి అందిస్తున్న శిక్షణ విధానాన్ని సమీక్షించారు. విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం, మర్యాదపూర్వక ప్రవర్తన, ప్రజా సేవా దృక్పథానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిని తనిఖీ చేసే సమయంలో వాహనదారులు, ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూనే పౌరుల గౌరవాన్ని కాపాడేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి చర్యలో వృత్తిపరమైన నడవడిక, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సహ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, రవాణా విభాగ అదనపు ఉన్నతాధికారి రవికుమార్, శేరిలింగంపల్లి సహాయ కమిషనర్ హనుమంతరావు, మాధాపూర్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాలం ముందస్తు చర్యలను వేగవంతం చేయాలి

**సైబరాబాద్ రక్షకభట కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్**

**క్షేత్రస్థాయిలో నీటి నిల్వ ప్రాంతాలు,నాళా పనుల పరిశీలన**



**శేరిలింగంపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న)** వర్షాకాలంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని సైబరాబాద్ రక్షకభట కమిషనర్ (సీపీ) డాక్టర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాయదుర్గం రక్షకభట నిలయం పరిధిలోని మల్కంచెరువు నీటి నిల్వ ప్రాంతం, సిటీ వైన్స్ పరిసరాలలోని వర్షపు నీరు నిలిచే స్థలాలను కమిషనర్ పరిశీలించారు. అలాగే మాదాపూర్ ప్రయాణ నియంత్రణ (ట్రాఫిక్) విభాగం పరిధిలో సంస్థాగత అభివృద్ధి కేంద్రం (సీఓడీ) వద్ద జరుగుతున్న నీటిగొట్టాల నిర్మాణం, నాళాల పురోగతిని పురపాలక వర్గాల అధికారులతో కలిసి ఆయన ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీటి నిల్వ సమస్యకు గల కారణాలను అధికారులు కమిషనర్కు వివరించారు. వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగించడం, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.దనీటి గొట్టాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, వాహనాల దారి మళ్లింపులపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ప్రయాణ నియంత్రణ విభాగం ఉమ్మడి కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి పురపాలక కమిషనర్ సృజన, సహాయ ˆక్షకభట కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, జలసంరక్షణ సమన్వయ సిబ్బంది (హైడ్రా) మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సురేష్ మృతికి రూ.31 లక్షల పరిహారం

**సీఐటీయూ పోరాటం ఫలితం.. యాజమాన్యంతో చర్చల అనంతరం అంగీకారం**

**బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కార్మిక సంఘాలు..**

**భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**




**చర్లపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :-(ప్రతినిధి గోపగాని పాండు)** చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ఫేజ్--2లో ఉన్న సుదర్శన్ ఇండస్ట్రీస్‌లో ఇటీవల చోటుచేసుకున్న విషాదకర పారిశ్రామిక ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సీఎన్‌సీ లేజర్ మిషన్ ఆపరేటర్ భత్తుల సురేష్ కుటుంబానికి రూ.31 లక్షల నష్టపరిహారం అందజేయాలని యాజమాన్యం అంగీకరించింది. సీఐటీయూ నాయకులు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు పలుమార్లు యాజమాన్యంతో జరిపిన చర్చల ఫలితంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.సురేష్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే సహోద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున స్పందించారు. కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, శాశ్వత పరిష్కారం కోసం యాజమాన్యంతో చర్చలు ప్రారంభించారు. బాధిత కుటుంబ పరిస్థితిని వివరించి, కుటుంబ పెద్దను కోల్పోయిన నేపథ్యంలో వారికి తగిన నష్టపరిహారం చెల్లించడం యాజమాన్యం నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. అనేక దఫాల చర్చలు, సంప్రదింపుల అనంతరం యాజమాన్యం చివరకు రూ.31 లక్షల పరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయంతో సురేష్ కుటుంబానికి కొంత ఆర్థిక భరోసా లభించినప్పటికీ, కుటుంబాన్ని కోల్పోయిన బాధను ఏ పరిహారమూ తీర్చలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**కీలక పాత్ర పోషించిన సీఐటీయూ నాయకులు**

పరిహారం విషయంలో సీఐటీయూ నాయకులు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బి.వి. సత్యనారాయణ, కార్యదర్శి జి. శ్రీనివాసులు కీలకంగా వ్యవహరించారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేస్తూ యాజమాన్యంతో నిరంతర చర్చలు కొనసాగించారు. వారి కృషి ఫలితంగానే యాజమాన్యం పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చిందని కార్మికులు పేర్కొన్నారు.

**భద్రతా ప్రమాణాలపై ఆందోళన**

ఈ ఘటన నేపథ్యంలో పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. యంత్రాల మరమ్మతులు, నిర్వహణ సమయంలో భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి కార్మికుడికి రక్షణ పరికరాలు అందించాలని, ప్రమాదకర యంత్రాల వద్ద ప్రత్యేక భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలను కాపాడడం యాజమాన్యాల తొలి బాధ్యత అని, భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు.

**ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలి**

పారిశ్రామిక ప్రాంతాల్లో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని కార్మిక శాఖ, ఫ్యాక్టరీల తనిఖీ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వల్ల ప్రాణనష్టం జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా ఉండాలని వారు పేర్కొన్నారు.

**పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది**

ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి అసలు కారణాలు ఏమిటి, యంత్రం నిర్వహణలో లేదా భద్రతా నిబంధనల అమలులో ఏవైనా లోపాలు జరిగాయా, సంస్థ నిర్లక్ష్యం కారణమా అనే అంశాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

**కార్మికుల్లో ఆందోళన**

ఈ ఘటనతో చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల్లో భద్రతపై ఆందోళన నెలకొంది. భవిష్యత్తులో ఇటువంటి విషాదాలు పునరావృతం కాకుండా ప్రతి పరిశ్రమలో ఆధునిక భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని, కార్మికుల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని వారు ప్రభుత్వానికి, యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. అలాగే సురేష్ కుటుంబానికి అవసరమైతే ఉద్యోగ అవకాశాలు, పిల్లల విద్యకు సహాయం వంటి అదనపు సంక్షేమ చర్యలు కూడా కల్పించాలని కార్మిక సంఘాలు కోరాయి.

## ఉప్పల్ నియోజకవర్గంలో సర్ పురోగతిపై సమీక్ష సమావేశం




**ఉప్పల్,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న ఎస్ఐఆర్ (సర్ ) ప్రక్రియపై ఉప్పల్ భాగాయత్ లోని శ్రీరస్తు కన్వెన్షన్లో సమీక్షా సమావేశం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ (సర్ )కోఆర్డినేటర్ వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున అందరూ వేగంగా పని చేయాలని, ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో సహాయం చేయాలని, ఇప్పటికే నింపిన ఫారాలను కలెక్ట్ చేసుకోవాలని కోరారు. వెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేసేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని, తక్కువ పర్సంటేజీ నమోదైన బూత్ లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ఏ ఒక్కరూ ఓటు కోల్పోకుండా కాంగ్రెస్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకంగా మారబోతోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# పటాన్చెరువులో ఘనంగా ఆషాఢ మాస బోనాల ఉత్సవాల తేదీ ఖరారు

**పటాన్చెరువు,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.వీరేష్)** రానున్న ఆషాఢ మాస బోనాల ఉత్సవాల తేదీల ఖరారు మరియు నిర్వహణ నిమిత్తం పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, పటాన్చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరియు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, కుల సంఘాల పెద్దలు మరియు పట్టణ ప్రముఖులతో చర్చించిన అనంతరం, ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను సికింద్రాబాద్ అమ్మవారి బోనాల ఉత్సవాల అనంతరం అనగా వచ్చే నెల ఆగస్టు 10వ తేదీ సోమవారం రోజున నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. అన్ని ఏర్పాట్లతో ఉత్సవాలు - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏటా జరిగే విధంగానే ఈసారి కూడా బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లతో ఘనంగా నిర్వహించాలని అధికారులను





మరియు నిర్వాహకులను ఆదేశించారు. భక్తులకు లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు - మెట్టు కుమార్ యాదవ్ పటాన్చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, దేశంలోనే ప్రసిద్ధి



గాంచిన పండుగ మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్య పండుగలలో ఒకటైన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఆగస్టు 10వ తేదీ సోమవారం నాడు నిర్వహించాలని పెద్దలందరి సమక్షంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకొని, అమ్మవారి బోనాలను అత్యంత వైభవంగా జరుపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో పటాన్చెరువు పట్టణ పుర ప్రముఖులు, పెద్దలు, నాయకులు, కుల సంఘాల పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తంటికొండ, గాదెలపాలెంలో ఘనంగా కంబాల కానుక వనితల వేడుక కార్యక్రమం

**1200 మంది మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేసిన కంబాల**

**తంటికొండలో రూ.2 లక్షలతో నిర్మించిన సత్సంగం భవనం, కాంపౌండ్ వాల్, షెడ్ ప్రారంభం**

**గోకవరం,జులై 29 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలం తంటికొండ, గాదెలపాలెం గ్రామాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'కంబాల కానుక వనితల వేడుక' పట్టుచీరలు పంపిణీ



కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ



ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత తంటికొండ గ్రామంలో కంబాల శ్రీనివాసరావు అందజేసిన రూ.2 లక్షలు విరాళంతో సత్సంగం భవనం వద్ద నూతనంగా నిర్మించిన కాంపౌండ్ వాల్, షెడ్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయనకు ఆయా గ్రామాల మహిళలు హారతులతో స్వాగతం పలికారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువత అభిమానులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. ఆయా గ్రామాలలోని



ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, గ్రామ దేవతలకు తొలి చీరలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి రెండు గ్రామాల మహిళల నుంచి విశేషా స్పందన లభించింది. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు తంటికొండ గ్రామంలో 850 మంది మహిళలకు, గాదెలపాలెం గ్రామంలో 350 మంది మహిళలకు ఉచితంగా పట్టుచీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, అభిమానులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదిన వేడుకలలో పాల్గొన్న తోట శ్రీ రాంజీ

**గోకవరం,జులై 29 .అక్షర టైమ్స్ :** మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు భూలా అబ్బులు సోదరుడు భూలా నాగేశ్వరావు మనుమరాలు మొదటి పుట్టినరోజు వేడుకలులో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ



రాంజీ పాల్గొని చిరంజీవి సోఫియాను దీవించి ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మిట మోహన్, గుమ్మలదొడ్డి గ్రామ సర్పంచ్ శరకణం మురళి, గ్రామ ఉప సర్పంచ్ చిన్న , గొన్యాల కృష్ణార్జున్,అంబటి అబ్రహం, చిన్నిబాబు తదితర పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం





**గోకవరం,జులై 29 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలం రంపయ రంపాలెం గ్రామంలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఈరోజు 3,000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ శిరిడి సాయి గురు పౌర్ణమి సందర్భంగా బాబా వారికి ప్రత్యేక పూజలు అందించి అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ వాళ్ళు తెలిపారు రంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము అన్నదాన నిమిత్తం 15 రైస్ బస్తాలు అందించారు అలాగే సాయిబాబా ఆలయానికి 21,000 రూపాయిలు విలువ చేసే 50 కుర్చీలు ఉంగరాల లక్ష్మణరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు లక్ష్మి ఫౌండేషన్ అధినేత ఉంగరాల గణేష్ బహుకరించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు సమ్మెట్ల అన్నవరం నవనాసి విష్ణు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# గోకవరం మండలంలో 7 మంది నూతన అంగన్వాడీ హెల్పర్స్ కు నియామక పత్రాలు

**74 కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్వు,యూనిఫాంల పంపిణీ**

**జగ్గంపేట,జులై 29 .అక్షర టైమ్స్ :** కోరుకొండ ఐసిడిఎస్ సిడిపిఒ సంధ్యారాణి ఆధ్వర్యంలో జగ్గంపేట రావులమ్మ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో బుధవారం గోకవరం మండలంలోని 7 అంగన్వాడీ ఆయా పోస్టులకు నూతనంగా నియమితులైన అంగన్వాడి హెల్పర్స్ కు



నియామక పత్రాలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందజేశారు. ఈ కార్యక్రమంలోనే గోకవరం మండలంలోని 74 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్వు, అంగన్వాడీ వర్కర్లకు యూనిఫాంలను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఇంధన పొదుపును లక్ష్యంగా చేసుకుని ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలకు



ఇండక్షన్ స్టవ్లను అందజేస్తున్నామని తెలిపారు. చిన్నారులకు సురక్షితమైన వంట, సిబ్బందికి సౌలభ్యం కల్పించడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొత్త నియామకాలతో గోకవరం మండలంలో సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడపా భరత్, కన్నబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, జనపరెడ్డి సుబ్బారావు (బాబు) కుంచే రాజా, దాసరి సీతారామకృష్ణ, బదిరెడ్డి బాబి, గల్లా రాము, నాగం వెంకటపతి, ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# నికాన్ ఇండియా ఫోటోగ్రఫీ వర్క్‌షాప్ విజయవంతం!



**రాజమండ్రి,జులై 29 .అక్షర టైమ్స్ :**రాజమండ్రిలోని శ్రీరస్తు బంకెట్ హాల్లో నికాన్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ వర్క్షాప్ ఘన విజయాన్ని సాధించింది.ఈ కార్యక్రమానికి నికాన్ మెంటర్ శరవణ కుమార్ మెంటర్గా వ్యవహరించగా, ఏ ఎస్ ఎమ్ శంకర్ పటేల్ , భాస్కర్,టీమ్ లీడర్ శ్రీక్రాంతి తమ అనుభవాన్ని పంచుకుని ఫోటోగ్రాఫర్లకు విలువైన సాంకేతిక అవగాహన కల్పించారు.ఈ వర్క్షాప్లో గోదావరి ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ లిమిటెడ్ అసోసియేషన్, రాజమండ్రి సభ్యులు, శివ జ్యోతి కెమెరా స్టోర్ ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన నికాన్ ఇండియా లిమిటెడ్ బృందానికి, శిక్షకులకు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.ద

# గురు పూర్ణిమ సందర్భముగా పండితులను సత్కరించిన బిజెపి నాయకులు




**గోకవరం,జులై 29 .అక్షర టైమ్స్ :** గోకవరంలో బుధవారం సాయంత్రం మురళి నగర్ లో ఉన్న శివాలయంలో వేద పండితులు గుల్లపల్లి దత్తాత్రేయ ఘనాపాటి,ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర కోవిదులు ,పండితులు, భాగవతోత్తములు, పూజ్య గురువర్యులు శివశంకర్ ను మండల బిజెపి నాయకులు సత్కరించి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర బిజెపి సీనియర్ నాయకుడు ఉంగరాల ఆదివిష్ణు తదితరులు మాట్లాడుతూ ఈరోజును గురు పూర్ణిమగా ఎందుకు జరుపుకుంటున్నాము అంటే పూర్వము ద్వాపర యుగములో అజ్ఞాన అంధకారములో కొట్టుమిట్టాడుతున్న మానవ సమాజంలో జ్ఞాన జ్యోతులను వెలిగించడానికి మానవాళికి మార్గదర్శనము చేయడానికి జ్ఞానబిక్ష ప్రసాదించడానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు వ్యాస మహర్షిగా అవతరించినటువంటి శుభతిథి ఆషాడ పూర్ణిమ అని ,వ్యాస మహర్షి చతుర్ముఖ బ్రహ్మ సృష్టించినటువంటి వేదాలను విభజన చేసి వేద వ్యాసుడు గా ప్రసిద్ధి చెందారని చతుర్వేదాలను అష్టాదశ పురాణాలను పంచమ వేదమైన మహాభారతాన్ని మోక్షప్రదాయకమైన భాగవత మహా పురాణాన్ని ఉపనిషత్తులను భగవద్గీత విష్ణు సహస్రనామాలు లలితా సహస్రనామాలు మొదలైన అపురూపమైన అద్భుతమైనటువంటి వాంగ్మయాన్ని మానవజాతికి ప్రసాదించిన మహా పురుషుడు జ్ఞాన స్వరూపుడు వేదవ్యాస మహర్షి అని ఆయన అవతరించిన పుణ్యతిథిని గురు పూర్ణిమ గా యుగయుగాలుగా జరుపుకుంటున్నామని ఈ పర్వదినాన మన ప్రాంతంలో ఉన్నటువంటి పండితులను సత్కరించడం వారి ఆశీస్సులు తీసుకోవడం మన సనాతన ధర్మములో మన సంప్రదాయమని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రైల్వే బోర్డు మెంబర్ బత్తుల వెంకన్న బాబు, జిల్లా బిజెపి కార్యదర్శి వన వెంకట సురేష్, బిజెపి జిల్లా కౌలు రైతు విభాగం కార్యదర్శి పిల్లా సత్యనారాయణ, ఏగి సాంబశివ, గండి వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు

# కావలి లో ఘనంగా దక్ష ప్రజాపతి జయంతి వేడుక



**కావలి,జులై 29 .అక్షర టైమ్స్ :** కావలి పట్టణం పెద్దపవని రోడ్ వైకుంఠపురం సెంటర్ నందు ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన కావలి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో కుమ్మర్ల ఆరాధ్య దైవం, కుమ్మర కుల ఆద్యుడు, మొట్టమొదటి కుండను తయారు చేసిన దేవ దేవుడు దక్ష ప్రజాపతి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన కావలి నియోజకవర్గ ఇంచార్జి బెజవాడ అభిసాగర్ ప్రజాపతి బుధవారం మాట్లాడుతూ క్షీర సాగర మధనం జరిగిన సమయంలో ముక్కోటి దేవతల కోరిక మేరకు ముక్కోటి మట్టి పాత్రలు తయారు చేసి అమృతం యొక్క పవిత్రతను కాపాడిన గొప్ప వ్యక్తి, కుమ్మర్ల ఆరాధ్యదైవం దక్ష ప్రజాపతి జయంతి కార్యక్రమాన్ని వైకుంఠపురం సెంటర్ నందు నిర్వహించడం ఎంత శుభప్రదం అని తెలియజేశారు. అలాగే ముసునూరు టోల్ ప్లాజా వద్ద కుమ్మర్లుకు ప్రభుత్వం కేటాయించిన 3 ఎకరాలు కుమ్మర్లు కుంటని ఆక్రమించాలని భూకబ్జాదారుల పన్నాగాలు రచిస్తున్నారు అవి ఫలించవు అని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కావలి కుమ్మర సంఘం అధ్యక్షుడు యెగురి పెద్ద పుల్లయ్య, మాజీ కౌన్సిలర్ లు మన్నేపల్లి లక్ష్మీ నర్సయ్య, గుడ్లూరి మాల్యాద్రి, యెగురి చిన్న పుల్లయ్య, బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్, కుమ్మర సంఘం నాయకులు బెజవాడ రవీంద్ర, శ్రీనివాసులు, డా. రామచంద్రమూర్తి, యెగురి పుల్లయ్య, బెజవాడ ప్రసన్న కుమార్, మన్నేపల్లి సుధాకర్, మన్నేపల్లి ప్రసాద్, మన్నేపల్లి లక్ష్మీ మణిప్రసాద్, శేషయ్య, పట్నం రవి, వేణు, రఘుపతి, దిలీప్, కిషోర్, ముసునూరు, గౌరవరం, బట్టలదిన్నె కుమ్మర కులస్తులు మరియు బీసీ, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, గౌతమ్ గౌడ్ పర్యటన






**శేరిలింగంపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న)** మదీనగూడలోని ఆర్కే నగర్ కాలనీలో నిన్న కురిసిన భారీ వర్షానికి వరద నీరు వచ్చి చేరింది. స్థానిక అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి భారీగా నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు అక్కడికక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి, మోటార్ల సహాయంతో సెల్లార్లలోని నీటిని త్వరగా బయటకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. అర్ధరాత్రి వరకు ఎమ్మెల్యే గాంధీ, గౌతమ్ గౌడ్ అక్కడే ఉండి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తూ బాధితులకు అండగా నిలిచారు. సకాలంలో స్పందించి తమను ఆదుకున్నందుకు కాలనీ, బస్తీ నివాసులు ఎమ్మెల్యే గాంధీకి, గౌతమ్ గౌడ్‌కు మరియు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# గురు పౌర్ణిమ వేడుకల్లో పాల్గొన్న పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి,సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్చెరు/భారతి నగర్ డివిజన్,జులై 29 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.వీరేష్)** గురు పౌర్ణిమ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అమీన్‌పూర్ పరిధిలోని సాయి కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో జరిగిన గురు పౌర్ణిమ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా వారికి పాలాభిషేకం, పుష్పార్చన, హారతి కార్యక్రమాల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. అలాగే భక్తులకు ప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భారతి నగర్ పరిధిలోని మాక్ సొసైటీ మరియు ఓల్డ్ ఎంఐజి కాలనీలో నిర్వహించిన గురు పౌర్ణిమ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గురువుల ఆశీస్సులతో ప్రజలందరికీ





ఆయురారోగ్యాలు, సుఖశాంతులు చేకూరాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. గురువుల బోధనలు సమాజానికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరూ వాటిని ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ బాల్‌రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, మాక్ సొసైటీ కమిటీ సభ్యులు మల్లేష్ యాదవ్, రవీందర్ రెడ్డి, ఓల్డ్ ఎంఐజి కాలనీ కమిటీ సభ్యులు అనిత, ప్రసాద్, రాజు, బీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ నాగమణి, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, రాకేష్, మునీందర్, లక్ష్మి మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీరంగూడ డివిజన్‌లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు





**అమీన్పూర్,జులై 29 .అక్షర టైమ్స్ :-(ప్రతినిధి ఏం.వీరేష్)** పవిత్ర గురుపౌర్ణమి సందర్భంగా అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్‌లోని సాయి కాలనీ, ఎన్ఆర్ఐ కాలనీ మరియు గోశాలలో ఉన్న సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్ మరియు అమీన్పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొని విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మరియు ఆలయ నిర్వాహకులు నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో సాయిబాబా వారికి వేదమంత్రాల మధ్య అభిషేకం, ప్రత్యేక పూజలు మరియు హారతి కార్యక్రమాలు నిర్వహించి, బాబా ఆశీస్సులు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కొరకు అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ డైరెక్టర్లు రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, కుమ్మరి మహేష్, చంద్రశేఖర్, జన్ముల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ నాయక్, బిక్షపతి, కృష్ణ, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మనోహర్, మస్తాన్ నాయుడు, రాము, మల్లారావు, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నివారణ, సైబర్ భద్రతపై అవగాహన సదస్సు






**ఏలేశ్వరం,జులై 29 .అక్షర టైమ్స్ :**స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కళాశాల లో బాల్య వివాహాలు నివారణ, సైబర్ భద్రతపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె. చంద్ర శారద ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) అధ్యక్షత వహించారు. సదస్సులో టీనేజ్ గర్భధారణ, బాల్య వివాహాల నివారణ, సైబర్ భద్రత, డిజిటల్ లిటరసీ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఐసీడీఎస్ సీడీపివో పద్మావతి , జె.అన్నవరం పి హెచ్ సి వైద్యులు జయరాం, నాగలక్ష్మి ఆధ్వర్యంలో పలు కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ డి ఏ కూటమి నాయకులు మాట్లాడుతూ సైబర్ భద్రత,డిజిటల్ అక్షరాస్యత, ,బాలల రక్షణ చట్టాలు,పోక్సో చట్టం,టీనేజ్ గర్భధారణ నివారణ,బాల్య వివాహాల నిరోధం,లక్ష్య నిర్ధారణ,వృత్తి మార్గదర్శకత్వం,మొక్కల పెంపకం వంటి అంశాలపై విద్యార్థినులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా వినియోగించుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని,ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్య ద్వారా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని వక్తలు సూచించారు.కార్యక్రమం ముగింపులో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడు పెంటకోట మోహన్, ఐసీడీఎస్ విస్తరణ అధికారి సూర్యకుమారి,స్కిల్ డెవలప్మెంట్ హబ్ ఇంచార్జి సత్యవతి , అంగన్‌వాడీ కార్యకర్తలు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## టీడీపీ వార్డు ఇంచార్జ్ చెన్నంశెట్టి పెంచలయ్యకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నివాళి



**కావలి,జులై 29 .అక్షర టైమ్స్ :** కావలి పట్టణం 20వ వార్డు కచ్చేరిమిట్ట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, 20వ వార్డు టీడీపి ఇంచార్జ్ చెన్నంశెట్టి పెంచలయ్య మృతి పట్ల కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం పెంచలయ్య నివాసానికి వెళ్ళి భౌతికకాయానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను భౌతికకాయంపై కప్పి పార్టీ తరపున చివరి డ్కోలు పలికారు. ఈ సందర్భంగా పెంచలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, చెన్నంశెట్టి పెంచలయ్య తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, ప్రజలతో కలిసిమెలిసి పనిచేసే తత్వం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. పెంచలయ్య మరణం పార్టీకి, ముఖ్యంగా కావలి పట్టణం 20వ వార్డు తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని చెన్నంశెట్టి పెంచలయ్యకు అశ్రునివాళులు అర్పించారు.

## ప్రతి ఇంటికీ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని తీసుకెళ్తున్నాం..: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి





**పొదలకూరు,జులై 29 .అక్షర టైమ్స్ :(రిపోర్టర్ ఆనంద్)** కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే ఈ ప్రచార కార్యక్రమ లక్ష్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు లోని అగచాట్లపురంలో బుధవారం జరిగిన రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, వారి సమస్యలు, సూచనలను తెలుసుకుంటున్నామని తెలిపారు.ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన,పిఆర్సి ఇచ్చిన అది తెలుగుదేశం పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు.ఐదేళ్ల వైసిపి పాలనలో అంతా సున్నా, నో డిఎస్సీ, నో పిఆర్సీ,నో ఎంక్రిమెంట్ అని అన్నారు.2014లో సీఎం చంద్రబాబు హయంలో 43 శాతం పీఆర్సీ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు.కాకాణి గోవర్ధన్ రెడ్డి లోకేష్ పట్ల అనుచితంగా మాట్లాడడాన్ని తీవ్రంగా పరిగణించారు.లోకేష్ ఒక ముఖ్యమంత్రికి మనవడు, ఒక ముఖ్యమంత్రి కొడుకు, ఉన్నత విద్యావంతుడు ఐటీ శాఖలో తన బ్రాండ్ ని చూపిస్తున్న నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పొదలకూరు బచ్‌పన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా గురు పూర్ణిమ వేడుకలు..




**పొదలకూరు,జులై 29 .అక్షర టైమ్స్ :(రిపోర్టర్ ఆనంద్)** పొదలకూరు లోని బచ్‌పన్ ఇంటర్నేషనల్ స్కూల్ లో బుధవారం గురు పూర్ణిమ వేడుకలను అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానం గురువుదే. అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును నింపే మహనీయుడు గురువు. విద్యార్థులు చిన్నతనం నుంచే గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురు పూర్ణిమ ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు శ్లోక పఠనం నిర్వహించి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులందరూ తమ ఉపాధ్యాయులకు గురు వందనం చేసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎక్కడ ఉన్నది న్యాయం

## ఎక్కడ ఉన్నది ధర్మం..మంజుల పత్తిపాటి

పచ్చని ప్రకృతిలో నరమేధం జరుగుతుంటే...
ఎక్కడ ఉన్నది న్యాయం ఎక్కడ ఉన్నది ధర్మం..!
తల్లి ప్రసవవేదన నుండి ఊపిరి పోసుకున్న
అరుణ పుష్పాన్ని ఆడపిల్ల అని నలిపేస్తుంటే...
ఎక్కడ ఉన్నది న్యాయం ఎక్కడ ఉన్నది ధర్మం..!
పసి మొగ్గ నుండి పండు ముసలి వరకు మహిళలని
నమిలి వస్తుంటే....
ఎక్కడ ఉన్నది న్యాయం ఎక్కడ ఉన్నది ధర్మం..!
సమాజ శ్రేయస్సు సమాజ అభివృద్ధి నెపంతో
స్వలాభం కోసం అడవి తల్లిని అంతం చేస్తూ ఉంటే...
ఎక్కడ ఉన్నది న్యాయం ఎక్కడ ఉన్నది ధర్మం..!
అధికార దాహం తుపాకుల మోతల ప్రతిధ్వనిలో
ఎందరో అమాయక ప్రజలు బలి అవుతుంటే ...
ఎక్కడ ఉన్నది న్యాయం ఎక్కడ ఉన్నది ధర్మం..!



రచన:
మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్
కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218.

## ప్రజలకు అంకితం కానున్న మందాటి చెరువు మినీ ట్యాంక్ బండ్

### పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి






**కావలి,జులై 29 .అక్షర టైమ్స్ :** కావలి పట్టణ ప్రజలకు మరింత మెరుగైన వినోద, ఆరోగ్య, విశ్రాంతి వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో మందాటి చెరువు పరిసర ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు ఇంజినీర్లతో కలిసి పరిశీలిస్తూ, ప్రతి పనిని నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మందాటి చెరువు ప్రాంతాన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రజా వినోద కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రజలు ఉదయం, సాయంత్రం ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకునేలా అత్యాధునిక వాకింగ్ ట్రాక్, రాత్రి వేళల్లో సైతం ప్రజలు సురక్షితంగా సంచరించేందుకు అధునాతన లైటింగ్, తెలుగు భాషా, సంస్కృతికి ప్రతీకగా తెలుగు తల్లి విగ్రహం, వృద్ధులు మరియు యువత వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ జిమ్, చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల గేమ్స్ మరియు ప్లే ఏరియాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కావలి పట్టణ ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సమయం గడిపేలా మందాటి చెరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని సూచించారు. రానున్న ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అభివృద్ధి పనులను కావలి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రదేశం పూర్తయిన తర్వాత పట్టణ ప్రజలకు ఒక అందమైన విహార కేంద్రంగా, ఆరోగ్యకరమైన వాకింగ్ స్పాట్‌గా, పిల్లలు, మహిళలు, వృద్ధులు అందరూ ఉపయోగించుకునే సమగ్ర పార్క్‌గా మారుతుందని ఆమె తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే కావలి పట్టణానికి మరో ప్రత్యేక ఆకర్షణగా మందాటి చెరువు మినీ ట్యాంక్ గా నిలుస్తుందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును రూపు దిద్దుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పొదలకూరులో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు..

### భక్తులతో క్రిక్కిరిసిన షిరిడి సాయి మందిరం





**పొదలకూరుజులై 29 .అక్షర టైమ్స్ :-(రిపోర్టర్ ఆనంద్)** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పొదలకూరు పట్టణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం భక్తిశ్రద్ధల నడుమ గురు పౌర్ణమి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఉదయం ఆలయ ప్రాంగణంలో ఓంకార ప్రణవ పతాకావిష్కరణను ఘనంగా నిర్వహించారు.సాయిబాబాకు పవిత్ర అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక అర్చనలు, ధుని పూజలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం సామూహిక షిరిడి సాయి సత్యవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, మహిళలు, పురుషులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించి గురు పౌర్ణమి పర్వదినాన్ని ఆధ్యాత్మిక ఆనందంతో జరుపుకున్నారు.సాయంత్రం సామూహిక అష్టోత్తర పూజలు, సాయంసంధ్యా హారతి, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం భక్తి పారవశ్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల సందర్భంగా ఆలయం అంతా భజనలు, నామస్మరణతో మారుమోగింది.ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు స్వామి, అర్చకులు రూప్ నారాయణస్వామి ఆధ్వర్యంలో అన్ని పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవా సమితి సొసైటీ అధ్యక్షుడు చీమకుర్తి రాజగోపాల్, కార్యదర్శి నాగిశెట్టి దామోదర్ రావు, ఉప కార్యదర్శి తరుగు ప్రభాకర్, కోశాధికారి పంగులూరు సుబ్బానాయుడు, సభ్యులు లక్కాకుల ఆనందరావు, కె. కోటేశ్వరరావు, తుమ్మల శ్రీనివాసులు, చాగిలేటి శ్రీహరి, భక్తులు తోట పెంచలయ్య, కదిరి పెంచల ప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో సాయిభక్తులు పాల్గొని గురు పౌర్ణమి వేడుకలను విజయవంతం చేశారు.

## భద్రతా నిర్లక్ష్యానికి బలైన కార్మికుడు

### సీఎన్‌సీ లేజర్ కటింగ్ యంత్రంలో చిక్కుకుని తల వేరై దుర్మరణం
### యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని భార్య ఆరోపణ
### సుదర్శన్ ఇండస్ట్రీస్ యాజమాన్యంపై కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభించిన చెర్లపల్లి పోలీసులు





**చర్లపల్లి,జులై 29 .అక్షర టైమ్స్ :-(ప్రతినిధి గోపగాని పాండు)** మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా చెర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని రెండో దశ (ఫేజ్--2)లో ఉన్న సుదర్శన్ ఇండస్ట్రీస్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. యంత్రాన్ని నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు సీఎన్‌సీ లేజర్ కటింగ్ యంత్రంలో చిక్కుకున్న కార్మికుడు బత్తుల సురేష్‌బాబు (41) అక్కడికక్కడే దారుణంగా మృతి చెందాడు. ప్రమాదం తీవ్రతకు అతని తల శరీరం నుంచి వేరైపోవడంతో ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన సహచర కార్మికులు భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ నాగార్జున నగర్‌లో నివాసం ఉంటున్న బత్తుల సురేష్‌బాబు స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కనపేశ్వరం గ్రామం. ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన ఆయన కుటుంబ పోషణ కోసం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి చెర్లపల్లి ఐడీఏలోని సుదర్శన్ ఇండస్ట్రీస్‌లో గత 20 రోజులుగా సీఎన్‌సీ లేజర్ కటింగ్ యంత్రం ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఎప్పటిలాగే ఇంటి నుంచి విధులకు వెళ్లిన సురేష్‌బాబు మధ్యాహ్నం సుమారు 2.15 గంటల సమయంలో యంత్రంపై పని చేస్తున్న సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. యంత్రాన్ని నిర్వహిస్తుండగా అనుకోకుండా అతని తల యంత్రంలో చిక్కుకోవడంతో క్షణాల్లోనే శరీరం నుంచి తల వేరైపోయింది. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర కార్మికులు భయంతో పరుగులు తీశారు. యంత్రాన్ని నిలిపివేసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే సురేష్‌బాబు మృతి చెందినట్లు తెలుస్తోంది.



మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు సురేష్‌బాబు మామ చాట్రగడ్డ ప్రేమానందం ఫోన్ ద్వారా ఈ విషాద వార్తను భార్య బత్తుల సుకన్యకు తెలియజేశారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులతో కలిసి కంపెనీకి చేరుకుంది. అక్కడ రక్తపు మడుగులో భర్త మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. యంత్రంలో శరీర భాగం చిక్కుకుని ఉండగా, తల వేరుగా కింద పడిపోయి ఉండటం చూసి ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో పరిశ్రమ పరిసరాలు విషాదమయంగా మారాయి. ఈ ఘటనపై బత్తుల సుకన్య చెర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కంపెనీ యాజమాన్యం ప్రమాదకర యంత్రాల వద్ద అవసరమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయలేదని, కార్మికులకు తగిన రక్షణ పరికరాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా పనులు చేయించడంతోనే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని ఫిర్యాదులో పేర్కొంది. కంపెనీ యజమాని భూమినేని రాజా పాపిరెడ్డి నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆమె ఆరోపించింది. ఫిర్యాదు ఆధారంగా చెర్లపల్లి పోలీసులు సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ప్రమాదం ఎలా జరిగింది? యంత్రంలో సాంకేతిక లోపం ఏమైనా ఉందా? భద్రతా నిబంధనలు పాటించారా లేదా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. ఈ దుర్ఘటనతో చెర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించే బాధ్యత యాజమాన్యాలపై ఉందని, ప్రమాదకర యంత్రాల వద్ద తప్పనిసరిగా రక్షణ ప్రమాణాలు అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న పరిశ్రమలపై కార్మిక శాఖ, ఫ్యాక్టరీల శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ ఘటన మరోసారి పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.

## 23 ఏళ్ల తర్వాత కొడుకును కలిసిన తల్లి- 18 ఏళ్లు వెట్టిచాకిరిలో మగ్గిపోయిన 'ప్రకాశ్'- ఎట్టకేలకు సొంతగూటికి!

### రెండు దశాబ్దాల తర్వాత కన్నవారికి దొరికిన కుమారుడు
### సంతోషంతో వెక్కివెక్కి ఏడ్చిన తల్లి- కుమారుడు సైతం ఎమోషనల్



23 ఏళ్ల క్రితం ఇంటి నుంచి పారిపోయిన ఓ యువకుడు ఎట్టకేలకు తన తల్లిదండ్రులకు కలిశాడు. ఇంటి నుంచి పారిపోయిన తర్వాత యువకుడు అనేక కష్టాలను అనుభవించాడు. పాకిస్థాన్ సరిహద్దులోని ఓ ఇంట్లో 18 ఏళ్లపాటు వెట్టిచాకిరి చేశాడు. సుదీర్ఘ కాలం తర్వాత అమ్మనాన్నల చెంతకు చేరడంతో యువకుడి కథ సుఖాంతమైంది. ఈ స్టోరీలో యువకుడు ఎలా ఇంటి నుంచి పారిపోయాడు? అందుకు గల కారణాలేంటి? ఇన్నాళ్లు ఎక్కడ ఉన్నాడు? తల్లిదండ్రుల వద్దకు మళ్లీ ఎలా చేరాడు? తదితర విషయాలు తెలుసుకుందాం.

### తల్లిదండ్రులు గొడవ కారణంగా

తమిళనాడులోని విరుద్‌నగర్ జిల్లా పూమలైపట్టి అనైకులం గ్రామానికి చెందిన దంపతులు రామమూర్తి, సుందరి. వీరికి ప్రకాశ్, ప్రభు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ దంపతులు జీవనోపాధి కోసం 30 ఏళ్ల క్రితం తమ కుటుంబంతో కలిసి కోయంబత్తూరుకు వలస వచ్చారు. వీరి పెద్ద కుమారుడు ప్రకాశ్ కౌండంపాలయం మున్సిపల్ పాఠశాలలో మూడో తరగతి వరకు, సాయిబాబా కాలనీలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకున్నాడు. అయితే రామమూర్తి, సుందరి మధ్య 2003లో చిన్న గొడవ జరిగింది. దీంతో ప్రకాశ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి తల్లిదండ్రులు, బంధువులు పలు ప్రదేశాల్లో వెతికినా ప్రకాశ్ ఆచూకీ తెలియలేదు.

### ఓసారి ఫోన్ చేసినా!

ఈ ఘటన జరిగిన సుమారు రెండు నెలల తర్వాత ప్రకాశ్ తన తల్లిదండ్రులను ఫోన్‌లో సంప్రదించాడు. తాను చెన్నైలో ఉన్నానని చెప్పాడు. ఆ తర్వాత మళ్లీ ప్రకాశ్ తన పేరెంట్స్‌కు ఫోన్ చేయలేదు. అతడి కోసం తల్లిదండ్రులు తీవ్రంగా వెతికినా ప్రయోజనం లేకపోయింది. ప్రకాశ్ ఆచూకీ లభించలేదు. ప్రకాశ్ చనిపోయి ఉంటాడని అతడి తల్లిదండ్రులు, బంధువులు భావించారు.

23 ఏళ్ల తర్వాత కొడుకును కలిసిన తల్లి (జుఎం దీష్టుతీఫ్)

### ఊహించని ట్విస్ట్

ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాది జులై 1న తిరుప్పూర్ జిల్లా పల్లడం ప్రాంతానికి చెందిన ముత్తయ్య అనే జర్నలిస్ట్ ప్రకాశ్ తల్లి సుందరిని సంప్రదించారు. పంజాబ్‌లోని పటియాలా జిల్లా లచ్‌ఖానిలో ఉన్న 'అప్నా ఘర్ సేవా సొసైటీ' (ఆశ్రమం) సంరక్షణలో ప్రకాశ్ ఉన్నాడని చెప్పారు. చనిపోయాడని భావించిన తమ కుమారుడు బతికే ఉన్నాడని తెలుసుకుని ఆనందంతో పాటు ఆశ్చర్యానికి గురైన రామమూర్తి, సుందరి దంపతులు ప్రకాశ్‌ను తిరిగి కోయంబత్తూర్‌కు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. వెంటనే ప్రకాశ్ సోదరుడు ప్రభు, కొంతమంది బంధువులు వెంటనే పంజాబ్‌లోని అనాథాశ్రమానికి బయలుదేరారు. కానీ సరైన పత్రాలు లేకుండా ప్రకాశ్‌ను పంపలేమని ఆశ్రమ నిర్వాహకులు తేల్చిచెప్పడంతో

# ఆగస్ట్ లో ఐపీఓల జాతర రూ.25 వేల కోట్లు సమీకరించనున్న కంపెనీలు

వచ్చే నెల ఆగస్ట్ లో ఐపీఓల జాతర మొదలు కానుంది. 14 పైగా కంపెనీలు మార్కెట్లోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో క్విక్ కామర్స్ లీడర్ జెప్టో, ట్రూహోమ్ ఫైనాన్స్, లాజిస్టిక్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ ఉన్నాయి. ఈ సంస్థలు సమిష్టిగా రూ. 25,000 కోట్లకు పైగా సమీకరించవచ్చని అంచనా వేస్తున్నారు. ఇది మార్కెట్ సెంటిమెంట్‌లో సానుకూల మార్పును సూచిస్తోంది. వేగవంతమైన డెలివరీ సేవలకు ప్రసిద్ధి చెందిన జెప్టో ఆగస్ట్ లో అతిపెద్ద ఐపీఓగా వస్తుంది. ఈ కంపెనీ ఐపీఓ ద్వారా 11.34 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 8,010 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. హౌసింగ్ ఫైనాన్స్ రంగంలోని ట్రూహోమ్ ఫైనాన్స్ కూడా ఐపీఓగా రానుంది. ఆ కంపెనీ ఐపీఓ ద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందులో రూ. 1,500 కోట్ల కొత్త ఇష్యూతో పాటు అంతే మొత్తంలో ఆఫర్ ఫర్ సేల్ ఉంటుంది. విద్యా మౌలిక సదుపాయాలపై దృష్టి సారించే ఎలివేట్ క్యాంపసెస్, ఆఫర్ ఫర్ సేల్ లేకుండా కేవలం ఫ్రెష్ ఇష్యూ ద్వారానే రూ. 2,550 కోట్లు సమీకరించాలని చూస్తోంది. షిప్రోకెట్, రూ. 1,100 కోట్ల కొత్త




ఇష్యూ , రూ. 1,242.35 కోట్ల వాటాను కలుపుకొని, రూ. 2,342.35 కోట్ల విలువైన ఐపీఓ కోసం దరఖాస్తు చేసింది. విద్యా సాంకేతికత, అసెస్‌మెంట్ సొల్యూషన్స్‌లో ప్రత్యేకత కలిగిన ఇన్నోవాటివ్యూ ఇండియా మరో ముఖ్యమైన పోటీదారగా ఉంది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 2,000 కోట్ల వరకు ఐపీఓను లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే పాల ఉత్పత్తుల తయారీ సంస్థ అయిన మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ ఐపీఓగా రానుంది. ఐపీఓ రూ. 1,553 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ధూత్ ట్రాన్స్‌మిషన్, ఏఆర్‌సీఐఎల్, ఆర్డీ ఇండస్ట్రీస్, గజ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, రేస్ ఆఫ్ బిలీఫ్, హై-టెక్ ఇంజనీర్స్, శంకేష్ జ్యువెలర్స్, లెర్న్‌ఫ్లూయెన్స్ ఎడ్యుకేషన్‌తో సహా అనేక ఇతర సంస్థలు కూడా పబ్లిక్ లిస్టింగ్‌ల కోసం సన్నద్ధమవుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది ఇటీవల జరిగిన ఐపీఓల ప్రారంభం నేపథ్యంలో, రాబోయే ఐపీఓ సీజన్ పెట్టుబడిదారులలో ఉత్సాహాన్ని రేకెత్తించింది. 2026లో ఇప్పటివరకు 36 భారతీయ కంపెనీలు తమ ఐపీఓలు వచ్చాయి. వాటిలో తొమ్మిది ఈ నెలలోనే వచ్చాయి. రాబోయే ముఖ్యమైన ఐపీఓలలో మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్, జూనిపర్ గ్రీన్ ఎనర్జీలవి ఉన్నాయి. మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ జూలై 29, జూనిపర్ గ్రీన్ జూలై 30న ఐపీఓగా రానున్నాయి. 2026లో వివిధ ఐపీఓల ద్వారా సుమారు 20 బిలియన్ డాలర్లను సమీకరించవచ్చని ఈక్విరస్ క్యాపిటల్‌కు చెందిన భావేష్ షా అంచనా వేశారు. అయితే, పెట్టుబడిదారులు వాల్యుయేషన్ల విషయంలో మరింత ఎంపిక చేసుకుంటున్నారని, నిధులను ఆకర్షించడానికి కంపెనీలు బలమైన అవకాశాలను ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# కియా రాకతో లిటిల్ కొరియాగా మారిన పెనుకొండ

## రాష్ట్రమంతా ఇదే నమూనా అమలుకు ప్రభుత్వం నయా ప్లాన్

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న చారిత్రాత్మక పట్టణం పెనుకొండ. ఒకప్పుడు విజయనగర సామ్రాజ్యానికి ద్వితీయ రాజధానిగా. శత్రుదుర్భేద్యమైన సైనిక స్థావరంగా చరిత్రకెక్కిన ఈ నేల, నేడు సరికొత్త పారిశ్రామిక విప్లవానికి వేదికగా మారింది. ఒక వైపు శ్రీ కృష్ణదేవరాయల నాటి కోట శిథిలాలు.. మరోవైపు పచ్చని కొండల నడుమ 1,100 ఎకరాల్లో విస్తరించిన గుడిపల్లి, అమ్మవరుపల్లి పారిశ్రామిక పార్క్.. ఇప్పుడు దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్ భారతీయ తయారీ ప్రధాన కార్యాలయానికి నిలయంగా మారింది. గతంలో రాళ్లు, రప్పలు, పొదలతో నిండిన ఈ కఠినమైన భూభాగం 2017లో కియా రాకతో అతి వేగంగా ఒక అత్యాధునిక ఆటోమొబైల్ టౌన్‌షిప్‌గా రూపాంతరం చెందింది. ఇక్కడి నుండి ప్రతిరోజూ 8 వేల కంటే ఎక్కువ కార్లు తయారవుతూ.. దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పెనుకొండలోని ఈ భారీ తయారీ కేంద్రంలో కియా తన 25 అనుబంధ సంస్థలతో కలిసి విస్తృతమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఎత్తైన అసెంబ్లీ ప్లాంట్లు, మెటల్ షీట్ గిడ్డంగులలో ఆటోమేటెడ్ గైడెడ్ వెహికల్స్ ఫోర్క్‌లిఫ్ట్‌ల నడుమ నారింజ, పసుపు రంగు రోబోటిక్ చేతులు అత్యంత కచ్చితత్వంతో కదులుతుంటే కార్మికులు వాటిని పర్యవేక్షిస్తుంటారు. అయితే, ఈ ప్రాంతం కేవలం భారీ యంత్రాల తయారీ కేంద్రంగా మాత్రమే మిగిలిపోలేదు. ఇక్కడ స్థానిక తెలుగు సంస్కృతి, దక్షిణ కొరియన్ జీవనశైలితో సజావుగా మేళవించింది. ఒకప్పుడు నిశ్శబ్దంగా ఉన్న ఈ ప్రాంతంలో నిలువుగా ఉండే కొరియన్ హంగూల్ లిపి, వంపులు తిరిగిన తెలుగు లిపితో కలిసి కనిపిస్తుంది. రాయలసీమ ఘాటైన మసాలాల వాసనలు, కొరియన్ సాంప్రదాయ వంటకాలైన కిమ్చి, గుక్సు, మ్యాన్ నూడుల్స్ సువాసనలతో కలిసిపోతున్నాయి. కొరియన్ సౌందర్య సాధనాల దుకాణాలు, కొరియన్ ఆహార పదార్థాలు లభించే సియోల్ స్టోర్ వంటివి స్థానికులతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఒకప్పటి గ్రామీణ పెనుకొండ.. సింగపూర్ లోని 'లిటిల్ ఇండియా' తరహాలో ఒక ఉత్సాహభరితమైన లిటిల్ కొరియాగా రూపాంతరం చెందింది ఆటోమొబైల్ మార్కెట్లో కియా ప్రకంపనలు.. కార్లపై ఏకంగా రూ. 2.70 లక్షల వరకు డిస్కౌంట్లు.. ఈ పారిశ్రామిక విప్లవం స్థానిక ఆర్థిక వ్యవస్థను ఊహించని రీతిలో మలుపు తిప్పింది. కియా, దాని అనుబంధ సంస్థలలో సుమారు 20 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. స్థానిక వ్యాపారులకు, ఇంటి యజమానులకు, రైతులకు ఈ రాక ఒక ఆర్థిక లాటరీ టిక్కెట్టులా మారింది. నివాస గృహాలకు డిమాండ్ పెరగడంతో.. అనేకమంది గ్రామస్థులు తమ ఇళ్లను అద్దెకు ఇచ్చి, పక్కనే ఉన్న పుట్టపర్తి వంటి ప్రాంతాలకు మారి నెలకు భారీగా అద్దె ఆదాయాన్ని పొందుతున్నారు. అలాగే ఉపాధి కోసం ఇతర రంగాలపై ఆధారపడిన స్థానికులు, కియా సరఫరాదారుల నెట్‌వర్క్‌లో భాగస్వాములై సొంత వ్యాపారాలను స్థాపించారు. ఉదాహరణకు గతంలో గ్రానైట్ క్వారీలలో పనిచేసినవారు ఇప్పుడు ఆటోమొబైల్ బాడీ పార్ట్‌ల సరఫరాదారులుగా మారి నిలకడైన ఆదాయాన్ని పొందుతున్నారు. కొరియన్ అధికారుల వసతి కోసం 12.6 ఎకరాల విస్తీర్ణంలో 82 ఆధునిక నివాస భవనాలతో ఒక ప్రత్యేక కొరియన్ టౌన్‌షిప్‌ను కూడా నిర్మించారు. ఈ సమ్మేళనం కేవలం ఆర్థిక పురోగతికే




పరిమితం కాకుండా.. సాంస్కృతిక, భాషా మార్పిడికి కూడా బాటలు వేసింది. కొత్త శిక్షణా కార్యక్రమాల ద్వారా స్థానిక యువతకు క్రమశిక్షణ, సమయపాలన, కచ్చితత్వంతో కూడిన కొరియన్ కార్పొరేట్ పని సంస్కృతిపై అవగాహన కల్పించారు. ప్రారంభంలో తమిళనాడుకు చెందిన అనుభవజ్ఞులైన ఇంజనీర్లపై ఆధారపడినప్పటికీ.. తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐటీఐ, డిప్లొమా కేంద్రాల ద్వారా స్థానిక యువత ఉత్పాదకతను పెంచారు. అంతేకాకుండా, భాషా అడ్డంకులను తొలగించడానికి శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో అతి తక్కువ ఖర్చుతో కొరియన్ భాషా కోర్సులను ప్రారంభించాయి ప్రొఫెషనల్ స్కూల్ వంటి సంస్థలు స్థానిక యువతను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాయి. స్థానిక ఇంజనీర్లు ఇప్పుడు అనర్గళంగా కొరియన్ భాషలో మాట్లాడుతుండగా. సాంకేతిక మాన్యువళ్లను చదవగలిగే నైపుణ్యం సాధించి వారి కెరీర్‌లో వేగంగా పురోగతి సాధిస్తున్నారు. ప్రస్తుతం పెనుకొండ అనుసరిస్తున్న ఈ ప్రగతిశీల నమూనాను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో రాబోయే రక్షణ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల విస్తరణ, రవాణా సౌకర్యాల అభివృద్ధితో ఈ ప్రాంతంలో గృహ సదుపాయాలు, ఆతిథ్య రంగానికి డిమాండ్ మరింత పెరగనుంది. విజయవాడపెనుకొండ హైవే, రైల్ ఓవర్‌బ్రిడ్జ్ పనులు పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ పోర్టుల ద్వారా కార్ల ఎగుమతి మరింత సులభతరం కానుంది. శతాబ్దాల క్రితం సాంస్కృతిక సంగమంగా నిలిచిన పెనుకొండ, నేడు అత్యాధునిక ఆటోమోటివ్ కచ్చితత్వం, తూర్పు ఆసియా వారసత్వంతో కూడిన ఒక విశిష్టమైన సాంస్కృతిక ఒయాసిస్‌గా మారి ప్రపంచ పటంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

# భారీగా పెరిగిన ప్రవాస భారతీయుల విదేశీ కరెన్సీ డిపాజిట్లు

ప్రవాస భారతీయుల విదేశీ కరెన్సీ డిపాజిట్లు కేవలం 45 రోజుల్లోనే భారీగా సేకరించినట్లు ఎస్‌బిఐ రీసెర్చ్ అంచనా వేసింది. ఇది 2013 ప్రత్యేక డిపాజిట్ పథకం కింద సేకరించిన మొత్తం కంటే ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్‌బిఐ చర్యలతో మొత్తం నిధుల సమీకరణ చివరికి 80-85 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని కూడా రీసెర్చ్ నివేదిక అంచనా వేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జూలై 17 వరకు మొత్తం నిధుల ప్రవాహం దాదాపు 20.7 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని నివేదించింది. ఇందులో ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్ల ద్వారా వచ్చిన 17.4 బిలియన్ డాలర్లు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్(బి) డిపాజిట్లు ఇప్పటికే 2013 పథకం కింద సమీకరించిన 26 బిలియన్ డాలర్లను దాటాయని ఎస్‌బిఐ అంచనా వేస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి దాదాపు మూడు నెలల సమయం పట్టిందని వివరించింది. ఈ పథకం ముగిసే నాటికి ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్లు 65-70 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని ఎస్‌బిఐ రీసెర్చ్ అంచనా వేస్తోంది. ఇది గతంలో అంచనా వేసిన 40-45 బిలియన్ డాలర్ల కంటే చాలా ఎక్కువ. విదేశీ విదేశీ కరెన్సీ రుణాలు, బాహ్య వాణిజ్య రుణాలు కలుపుకొని, మొత్తం నిధుల సేకరణ 80-85 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నివేదిక అంచనా వేస్తోంది. ఈ సమీకరణకు ప్రభుత్వ రంగ బ్యాంకులే ప్రధానంగా పనిచేసే అవకాశం ఉందని



[illegible]

తెలిపింది. అధిక వడ్డీ రేట్ల కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మెచ్యూర్ అయ్యే ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్(డీ) డిపాజిట్లలో గణనీయమైన భాగాన్ని కొత్త పథకం కింద తిరిగి పొందే అవకాశం ఉంది.కేవలం ఈ పునరుద్ధరణల నుంచే 10 బిలియన్ డాలర్లు రావచ్చని ఎస్‌బిఐ రీసెర్చ్ పేర్కొంది. జూలై 17 వరకు ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్(డీ) ప్రవాహాలు 17.4 బిలియన్ డాలర్లుగా ఉండగా, జూన్ 8 నుంచి ఎఫ్‌సిఏ కేవలం 7.6 బిలియన్ డాలర్లు మాత్రమే పెరిగిందని అది తెలిపింది. జూలై నెలాఖరు నాటికి ఎఫ్‌సిఏ వృద్ధి 17-20 బిలియన్ డాలర్లకు చేరుతుందన నివేదిక అంచనా వేసింది. అయితే రూపాయి బలహీనపడుతూనే ఉందని, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో ఆర్‌బిఐ జోక్యం తగినంత బలంగా లేదని రీసెర్చ్ నివేదికలో పేర్కొంది. భారతదేశానికి దాదాని 676 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉందని తెలిపింది. 1997-98లో సగటు జోక్యం రోజుకు సుమారు 55 మిలియన్ ఉండేది. ఈ చర్యలకు ముందు 65-70 బిలియన్ డాలర్ల లోటు ఉంటుందని అంచనా వేసినప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరంలో చెల్లింపుల సమతుల్యత 50 బిలియన్ డాలర్లకు పైగా మిగులు స్థాయికి మారుతుందని ఎస్‌బీఐ పేర్కొంది. అలాగే, కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 1.0-1.2 శాతం స్థాయిలో ఉంటుందని అంచనా వేసింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# బైక్" కొనాలనుకుంటున్నారా

## ఫైనాన్స్ లో కొంటే మంచిదా , క్యాష్ చెల్లిస్తే మేలా

## 'టూవీలర్" ఫైనాన్స్ లో తీసుకోవడం మంచిదేనా

## నిపుణులు ఏం చెబుతున్నారంటే

ఇప్పుడు ద్విచక్ర వాహనం ఒక అవసరం. కాదు, కాదు అత్యవసరం. కారు కూడా అవసరాల జాబితాలో చేరిపోయిన నేటి పరిస్థితుల్లో, ప్రతీ ఇంట్లో బైక్ ఉండడం అనివార్యంగా మారిపోయింది. అందుకే, చాలా మంది చిన్నదో, పెద్దదో ఒక బైక్ కొనుగోలు చేస్తుంటారు. అయితే, బైక్ కొనుగోలు చేసే సమయంలో కొంతమంది మొత్తం ఒకేసారి డబ్బు చెల్లించే స్థోమత లేక లోన్ తీసుకుంటుంటారు. ఇంకొందరు మాత్రం మొత్తం ఒకేసారి చెల్లిస్తుంటారు. ఇదే క్రమంలో చాలా మందికి బైక్ కొనుగోలు విషయంలో రకరకాల సందేహాలు వస్తుంటాయి. ఇంతకీ, బైక్? తీసుకునేటప్పుడు మొత్తం ఒకేసారి చెల్లిస్తే మేలా? లేక ఫైనాన్స్‌లో తీసుకుంటే మంచిదా దీనిపై ఆర్థిక నిపుణులు ఏం చెబుతున్నారో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ద్విచక్రవాహనం కొనుగోలు టైమ్?లో ఫైనాన్స్ లేదా లోన్ చెల్లింపు కోసం ఈఎంఐ ఆప్షన్ ఎంచుకోవడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉంటాయంటున్నారు ఆర్థిక నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటి గురించి ఇప్పుడు చూద్దాం. మీరు బైక్ కొనుగోలు చేసేటప్పుడు వాయిదాల పద్ధతి ఎంచుకుంటే.. వెహికల్ ఖరీదు మొత్తం ఒకేసారి కట్టాల్సిన అవసరం ఉండదు. దాంతో కొంచెం ఎక్కువ ధర బైక్?నైనా కొనుగోలు చేసే ఛాన్స్ ఉంటుంది. మీ డ్రీమ్ బైక్ తీసుకునేందుకు ఇదొక మంచి అవకాశం. అలాగే, కొన్నిసార్లు తగినంత డబ్బు లేకపోవడం వల్ల రాజీపడి మన అవసరాలకు తగిన ద్విచక్రవాహనం తీసుకోలేకపోతాం. అదే లోన్ లేదా ఫైనాన్స్ తీసుకుంటే అలా రాజీపడాల్సిన అవసరం ఉండదంటున్నారు నిపుణులు. బైక్/స్కూటీ/స్కూటర్ కొనుగోలు కోసం ఒకేసారి డబ్బు చెల్లిస్తే మీ జేబులు ఖాళీ అయ్యే ఛాన్స్ ఉంటుంది. పైగా మీరు సేవ్ చేసిన డబ్బు నుంచి కొంత సొమ్ము తీయాల్సి రావొచ్చు. అలాంటి టైమ్?లో ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఇబ్బందులు తప్పవంటున్నారు నిపుణులు. అదే, ఈఎంఐ ఎంచుకుంటే మీ పొదుపు జోలికి వెళ్లాల్సిన పని లేదు. అలాంటప్పుడు మీరు ఎలాంటి ప్రాబ్లమ్స్?ను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉన్నట్లే అంటున్నారు. మీరు ఈఎంఐలో బైక్ తీసుకున్నట్లయితే అందుకోసం నెల నెలా మీ ఆదాయం నుంచి కొంత డబ్బు పక్కన పెట్టాల్సి ఉంటుంది. అలా మీకు తెలియకుండానే పొదుపు చేయడం అలవాటు అవుతుందంటున్నారు నిపుణులు. మీ వెహికల్ లోన్ తీరిన తర్వాత కూడా



దాన్ని అలాగే కంటిన్యూ చేస్తే పొదుపు పెరుగుతుందంటున్నారు. దాన్ని సరైన పద్ధతిలో మదుపు చేస్తే సంపద సైతం సృష్టించుకోవచ్చని సూచిస్తున్నారు. భార్య పేరు మీద "కారు" కొంటే లోన్ పై తక్కువ వడ్డీతో పాటు మరెన్నో బెనిఫిట్స్ చాలా మంది పత్రాలు, ప్రక్రియలకు భయపడే లోన్ తీసుకోవడానికి వెనుకాడుతుంటారు. కానీ, ప్రస్తుతం చాలా కంపెనీలు తక్షణమే ఆన్?లైన్?లో రుణాలు అందిస్తున్నాయి. అన్ని అర్హతలూ ఉండి పత్రాలన్నింటినీ ఆన్ లైన్ లో అప్ లోడ్ చేస్తే గంటల్లో లోన్స్ మంజూరు చేస్తున్న సంస్థలు ఉన్నాయి. అయితే, వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా కంపెనీల విశ్వసనీయతను గుర్తించడంలో విఫలమైతే ఇబ్బందులు తప్పవని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు. ప్రస్తుతం కొన్ని బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు తక్కువ వడ్డీ రేటుకే లోన్స్ అందిస్తున్నాయి. ఇది ఒక మంచి అవకాశం అనే చెప్పుకోవాలి. టూ వీలర్ లోన్స్ పై వడ్డీ రేట్లు 7.60% నుంచి 28% శాతం వరకు ఉంటున్నాయి. అయితే, ఈ వడ్డీ రేటు అనేది మీరు తీసుకునే బ్యాంకు, కాలపరిమితిని బట్టి మారుతూ ఉంటుందని గమనించాలి. ఒకవేళ మీరు స్వయం ఉపాధి పొందుతున్న వారైతే.. టూ వీలర్ లోన్‌పై కట్టే వడ్డీకి పన్ను మినహాయింపులు కూడా ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి నిపుణుల అభిప్రాయం ప్రకారం చేస్తున్న సూచనలు మాత్రమే. వీటిని పాటించాలా లేదా అనేది పూర్తిగా మీ వ్యక్తిగత నిర్ణయం.

# రూ.100 లోపు క్వాలిటీ స్టాక్స్ కోసం చూస్తున్నారా



క్వాలిటీ స్టాక్స్ అంటే ఎక్కువ ప్రైస్ ఉంటాయని అనుకుంటారు. అయితే తక్కువ ప్రైస్ లో కూడా క్వాలిటీ స్టాక్స్ ఉంటాయి. వాటిని గుర్తించి పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. 100 రూపాయల లోపు స్టాక్ ల్లో పెట్టుబడి పెట్టి కూడా మంచి రాబడి సాధించే అవకాశం ఉందని వివరిస్తున్నారు. అయితే, తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్‌లకు మంచి ఫండమెంటల్స్ ఉండకపోవచ్చు, ఇది దీర్ఘకాలిక సంపద సృష్టికి చాలా కీలకమని గుర్తు చేస్తున్నారు. కొన్ని కీలకమైన ఫండమెంటల్ సమాచారంతో పాటు 100 రూపాయల లోపు ఉన్న 9 స్టాక్స్ ఇవే. పూణే కేంద్రంగా పనిచేస్తున్న సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్, విండ్ పవర్ ఉత్పత్తి చేస్తోంది. ఈ కంపెనీ ఒక ప్రముఖ పునరుత్పాదక ఇంధన తయారీదారుగా ఉంది. 100 రూపాయల లోపు కొనుగోలు చేయడానికి ఉత్తమ షేర్లలో ఒకటిగా నిలుస్తుంది. ప్రాథమిక అంశాల విషయానికి వస్తే సుజ్లాన్ 26.47% ఈక్విటీపై రాబడి (23.42% మూలధనంపై రాబడి రాబడిని వస్తుంది. 2026 ఫిబ్రవరి 28 నాటికి ఈ కంపెనీ 15.07% బలమైన రాబడిని సాధించింది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలోని ఒక బ్యాంకుగా ఉంది. ఈ కంపెనీ ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రంగంపై దృష్టి సారించి వ్యక్తిగత, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలను అందిస్తుంది. ఈ బ్యాంకు 2026 ఫిబ్రవరి నాటికి రూ. 74,449.63 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ఉంది. ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ రూ. 100 లోపు టాప్ 10 స్టాక్‌లలో ఒకటిగా ఉంది. బ్యాంక్ 1.53 ప్రైస్-టు-బుక్ నిష్పత్తి ఇది కొద్దిగా అధిక విలువ కలిగి ఉందని సూచిస్తుంది. అయినప్పటికీ రూ.50 నుంచి 100 రూపాయల షేర్ ధర జాబితాలోని దాని తోటి కంపెనీలతో పోలిస్తే ఇది ఇప్పటికీ తక్కువ నిష్పత్తిలో ఉంది. అందువల్ల ఇది విలువ ఆధారిత పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తుంది. ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న చీనాబ లిమిటెడ్ దేశంలో అగ్రగామి జలవిద్యుత్ సంస్థగా ఉంది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సంస్థ మొత్తం 7232.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉండటమే కాకుండా, మరో 15 ప్రాజెక్టులను నిర్మిస్తోంది. దీనివల్ల దీర్ఘకాలిక పెట్టుబడికి రూ. 100 లోపు ధరలో లభించే అత్యుత్తమ స్టాక్‌లలో ఇది ఒకటిగా నిలుస్తోంది. భారత ప్రభుత్వం దీనికి 'నవరత్న' హోదాను కల్పించింది. న్యూఢిల్లీ కేంద్రంగా, గృహ మరియు పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నియంత్రణలో పనిచేస్తున్న (ఇండియా) లిమిటెడ్, 100 రూపాయల లోపు కొనుగోలు చేయడానికి ఉత్తమమైన షేర్లలో ఒకటి. ఈ కంపెనీ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో పనిచేస్తుంది. నివాస, వాణిజ్య ప్రాజెక్టులకును నిర్మిస్తోంది. మార్చి 31, 2024 నాటికి రూ. 2,222.62 కోట్ల అధిక నికర విలువతో ఉంది. కంపెనీ మూలధనంపై రాబడి 37.07 శాతంగా ఉంది. 100 రూపాయల లోపు టాప్ 10 ఫార్మా షేర్లలో ఒకటైన మోర్‌పెన్ లాబొరేటరీస్ లిమిటెడ్, న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తుంది. నాలుగు తయారీ కేంద్రాలతో, ఈ కంపెనీ 800కు పైగా యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ బ్రాండెడ్ డ్రగ్ ఫార్ములేషన్లను ఉత్పత్తి చేస్తుంది. 100 రూపాయల లోపు టాప్ 10 ఫార్మా షేర్లలో మోర్‌పెన్ లాబొరేటరీస్ తన స్థానానికి అర్హత సాధించడానికి మరో కారణం దాని 20.16 ప్రైస్-టు-ఎర్నింగ్స్ నిష్పత్తి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# మే నెలలోనూ రష్యా నుంచి భారీగా చమురు దిగుమతులు

## రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్

## మే నెలలో రష్యా నుంచి 5.8 బిలియన్ యూరోల విలువైన

## ఇంధనాలను దిగుమతి చేసుకున్న భారత్

## రష్యా ఇంధనాల రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్



రష్యా నుంచి భారత్?కు భారీగా చమురు దిగుమతులు అవుతున్నాయి. మే నెలలో ఆ దిగుమతులు మరింత పెరిగాయి. సుమారు భారత్ సుమారు 5.8 బిలియన్ యూరోల (దాదాపు 6.7 బిలియన్ డాలర్లు) విలువైన చమురును కొనుగోలు చేసినట్లు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆం ఈఏ) నివేదిక తెలిపింది. దీంతో ప్రపంచంలో రష్యా ఇంధనాల రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్ కొనసాగింది. సీఆర్ఈఏ నివేదిక ప్రకారం, భారత్ దిగుమతి చేసుకున్న రష్యా ఇంధనాల్లో అత్యధిక భాగం క్రూడ్ ఆయిల్‌దే. మొత్తం దిగుమతుల్లో సుమారు 83 శాతం వాటా క్రూడ్ ఆయిల్‌ది ఉంది. దీని విలువ 4.8 బిలియన్ యూరోలుగా ఉంటుంది. అదేవిధంగా చమురు ఉత్పత్తుల దిగుమతుల విలువ 550 మిలియన్ యూరోలు కాగా, బొగ్గు దిగుమతులు 429 మిలియన్ యూరోలుగా నమోదయ్యాయి. ఇక మే నెలలో భారత్ మొత్తం క్రూడ్ ఆయిల్ దిగుమతులు నెలవారీగా 8 శాతం పెరిగాయి. ఇందులో రష్యా నుంచి వచ్చిన చమురు దిగుమతులు ఏకంగా 21 శాతం పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంది. దేశంలోని ప్రధాన రిఫైనరీ కేంద్రాల్లో రష్యా చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. గుజరాత్‌లోని వడినార్ రిఫైనరీలో ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో రష్యా క్రూడ్ చేరికలు 36 శాతం పెరిగాయి. అదే రాష్ట్రంలోని జామ్‌నగర్ రిఫైనింగ్ సముదాయానికి వచ్చిన రష్యా చమురు సరఫరాలు 14 శాతం మేర పెరిగాయి. తగ్గింపు ధరలకు లభిస్తున్న రష్యా చమురు భారత రిఫైనరీలకు ఇప్పటికీ ఆకర్షణీయంగానే ఉందని నివేదిక పేర్కొంది. గతేడాది నవంబర్ చివర్లో రష్యా చమురు దిగుమతులను నిలిపివేసిన ప్రభుత్వ రంగ రిఫైనరీలు ఈ ఏడాది మార్చి నుంచి మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించాయి. దీంతో కర్ణాటకలోని న్యూ మంగళూరు రిఫైనరీలో మే నెలలో రష్యా చమురు దిగుమతులు 13 శాతం పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రిఫైనరీలో అయితే ఈ పెరుగుదల 42 శాతానికి చేరింది. ఒడిశాలోని పరదీప్ రిఫైనరీ కూడా గత రెండేళ్లలో అత్యధిక స్థాయిలో రష్యా క్రూడ్‌ను స్వీకరించినట్లు సీఆర్ఈఏ వెల్లడించింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి అనంతరం పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షల కారణంగా ప్రపంచ ఇంధన వాణిజ్య సమీకరణాలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో తగ్గింపు ధరలకు లభిస్తున్న రష్యా చమురును భారత్ పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. సీఆర్ఈఏ నివేదిక ప్రకారం, మే 2026లో రష్యా క్రూడ్ ఎగుమతుల్లో 50 శాతం వాటాను చైనా కొనుగోలు చేసింది. 36 శాతం వాటాతో భారత్ రెండో స్థానంలో నిలిచింది. తుర్కియే 6 శాతం, యూరోపియన్ యూనియన్ 5 శాతం వాటాతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి. రష్యా క్రూడ్‌తో తయారైన చమురు ఉత్పత్తుల దిగుమతులపై యూరోపియన్ యూనియన్ నిషేధం విధించింది. అయినప్పటికీ, రష్యా చమురును వినియోగించే భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియా రిఫైనరీల నుంచి తయారైన ఉత్పత్తులు పలు ఆంక్షలు విధించిన దేశాలకు చేరుతున్నాయని నివేదిక పేర్కొంది. మే నెలలో మాత్రమే ఈ దేశాల రిఫైనరీలు సుమారు 641 మిలియన్ యూరోల విలువైన చమురు ఉత్పత్తులను యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాలకు ఎగుమతి చేసినట్లు వెల్లడించింది. అమెరికాకు వెళ్లిన కొన్ని చమురు ఉత్పత్తులు గుజరాత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలోని జామ్‌నగర్ రిఫైనరీ నుంచి ఎగుమతి అయినట్లు సీఆర్ఈఏ పేర్కొంది.



# సిత్తరాల నవ్వు.. సిలకల్లే నువ్వు..

తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'. జి.జి.విహారి దర్శకుడు. రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై రవి పనస ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవలే ఈ చిత్రం నుంచి రెండో పాట 'సిత్తరాల నవ్వు' విడుదలైంది. కృష్ణప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు జి.జి.విహారి సాహిత్యాన్ని అందించారు. జావెద్ అలీ ఆలపించారు. 'సిత్తరాల నవ్వు..అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు..' అంటూ కథానాయిక అందాన్ని వర్ణిస్తూ ఈ పాట సాగింది. పల్లెటూరి నేపథ్యంలో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: కె.పి, కథ, దర్శకత్వం: జి.జి.విహారి.

# చిట్టి చేతులతో అయ్యో రామా..



దుల్కర్ సల్మాన్ మలయాళంలో పెద్ద స్టార్. అలాగే తెలుగు ప్రేక్షకులకూ అభిమాన నటుడు. దుల్కర్ తెలుగులో నేరుగా చేసిన మహానటి, సీతారామం, లక్కీభాస్కర్ చిత్రాలు వసూళ్ల పరంగా వందకోట్ల మార్కును దాటాయి. ఇప్పుడున్న ఏ పరభాషా నటుడికీ దక్కని రికార్డ్ ఇది. ప్రస్తుతం ఆయన తెలుగులో 'ఆకాశంలో ఒక తార' అనే సినిమా చేస్తున్నారు. శ్రుతిహాసన్, సాత్విక వీరవల్లి కథానాయికలు. పవన్ సాదినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. మంగళవారం దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'చిట్టి చిట్టి చీమ.. చిట్టి చేతుల్తో అయ్యో రామా.. వంద టన్నుల చెక్కెర మోస్తుందమ్మా..' అంటూ సాగే ఈ పాటను శ్రీమణి రాయగా, జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. రమ్య బెహరా ఆలపించారు. కథలోని సారాంశాన్ని ఈ పాట సాహిత్యంలో మిళితం చేసి రాసినట్టుగా హీరోయిన్ కోణంలో ఈపాట సాగింది. నక్షత్రాలను తాకాలని కలలు కనే ఓ అమ్మాయి కలను, ఆమె పక్కనే నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే అబ్బాయి ప్రేమను ఈ పాట ప్రతిబింబిస్తున్నది. సంప్రదాయ ప్రేమకథలకు భిన్నంగా, ఒక ప్రత్యేకమైన బంధాలను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

# ఆరు నెలలు నాతో మాట్లాడలేదు

'లెనిన్'తో ఎట్టకేలకు హిట్ ట్రాక్ ఎక్కేసింది పూణే పూబోణి భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం 'లెనిన్' సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తూ, మరోవైపు తమిళంలో శివకార్తికేయన్ సరసన 'సియోన్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. తాజాగా ఓ కళాశాల విద్యార్థులతో టాక్ షోలో ముచ్చటించిన భాగ్యశ్రీ.. తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నది. 'నాకు నటనంటే ఇష్టం. నటిని కావడం నా గోల్. కెరీర్ విషయంలో మన నిర్ణయాన్ని మన మనస్సాక్షి అంగీకరించినప్పుడు, ఇక ఏ విషయంలోనూ రాజీ పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ రాజీ పడాల్సివస్తే, మనకు మనమే పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. అందుకే నా నిర్ణయాన్ని నేరుగా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను. 'వద్దు' అనింది. నాన్నకు ఫోన్ చేస్తే 'అమ్మ వద్దన్న పని ఎలా చేస్తావ్?' అని ప్రశ్నించారు. అక్క అయినా మద్దతుగా నిలుస్తుందనుకుంటే.. 'అమ్మ నాన్న వద్దంటున్నారు కదా?' అనేసింది. ఇలా అంతా 'నో' చెప్పేశారు. కానీ నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆడిషన్స్‌కి వెళ్లిపోయా. దీంతో ఇంట్లో వాతావరణం వేడెక్కింది. మా అమ్మ ఆరు నెలలు నాతో మాట్లాడ్లేదు. నన్ను వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసింది. ఇప్పుడు ఈ విషయాన్ని నవ్వుతూ చెబుతున్నాను కానీ.. అప్పుడు మాత్రం చాలా బాధపడ్డా' అంటూ తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే.






# సిరీస్ చూసి చిరంజీవి మెచ్చుకున్నారు

శ్రీకాంత్ ప్రధాన పాత్ర పోషించిన వెబ్ సిరీస్ 'అబ్జెక్షన్ మై లార్డ్'. 'నోటరీ పరశురాం' అనేది ఉపశీర్షిక. అనన్యశర్మ, ముఖేష్‌రుషి, స్నేహాల్, సమీర్ కీలక పాత్రధారులు. సంతోష్ అయ్యప్పన్ దర్శకుడు. రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మాత. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 31 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ కానున్నది. తాజాగా హైదరాబాద్‌లో ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌ని నిర్వహించారు. 'దర్శకుడు క్లారిటీతో ఈ సిరీస్ తెరకెక్కించారు. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. టోటల్ అవుట్‌పుట్ చూశాక ఫిదా అయ్యాం. ప్రతి పాత్రలోనూ మంచి ఎలివేషన్ ఉంటుంది. చిరంజీవి ఈ సిరీస్ చూసి బావుందని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మా టీమ్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని నటుడు శ్రీకాంత్ అన్నారు. దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ 'కేవలం 19రోజుల్లో ఈ సిరీస్ షూటింగ్ పూర్తి చేశాం. టీమ్ అంతా సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది. ఈ సిరీస్ సూపర్ సక్సెస్ అవుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత రాజ్‌కుమార్ ఆకెళ్ల, నటులు ముఖేష్ రిషి, అనన్యశర్మ, సమీర్, నారాయణ హరిచంద్ర, జెమినీ సురేశ్ కూడా మాట్లాడారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com